సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 06.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 134
పేజీలు: 12 వెల: రూ. 5


# టీమిండియా ఊచకోత..



వాంఖడే స్టేడియం వేదికగా జరుగుతున్న సెమీఫైనల్ పోరులో టీమిండియా బ్యాటర్లు వీరవిహారం చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోత కోస్తూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు నమోదు చేశారు. ఓపెనర్ సంజు శాంసన్ (89) మెరుపు ఇన్నింగ్స్‌కు తోడు.. శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ ధాటిగా ఆడటంతో భారత్ పరుగుల వర్షం కురిపించింది.

## అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి

# భేష్ 03

డబుల్ ఇంజిన్ సర్కార్ తో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది




- ఐదేళ్లలో 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలోకి
- మౌలిక సదుపాయాల్లోనూ పురోగతి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

## అంతర్జాతీయ పర్యావరణహిత నగరంగా

# హైదరాబాద్

క్యూర్.. ప్యూర్.. రేర్ విభజనతో అభివృద్ధికి ప్రణాళికలు



- క్యూర్-ప్యూర్ రీజియన్ల మధ్యలో హరిత జోన్లు
- ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు

09



## లొంగుబాటులో దళపతి

# గణపతి 10

అడవి వీడిన 'టీచర్': ఢిల్లీలో ఎస్ఐబీ అదుపులో ముప్పాళ్ల లక్ష్మణరావు

- నేపాల్‌లో అదుపులోకి తీసుకుని ఢిల్లీకి తరలించినట్లు సమాచారం
- అమిత్ షా – రేవంత్ రెడ్డి సమక్షంలో లొంగుబాటు ఏర్పాట్లు
- అనారోగ్యంతో నేపాల్‌లో సాధారణ వ్యక్తిలా గణపతి జీవితం
- జగిత్యాల ఉపాధ్యాయుడిగా మొదలై మావోయిస్టు ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన గణపతి
- గణపతి లొంగితే మావోయిస్టు ఉద్యమానికి ముగింపు పలుకుతుందని ప్రభుత్వాల అంచనా

*దశాబ్దాల పాటు దండకారణ్యాన్ని శాసించి, విప్లవ సిద్ధాంతాలతో మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి లొంగుబాటుకు రంగం సిద్ధమైంది. తీవ్ర అనారోగ్యం, వృద్ధాప్య భారంతో ప్రస్తుతం నేపాల్‌లో సాధారణ జీవితం గడుపుతున్న ఆయనను.. కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు అత్యంత గోప్యంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఢిల్లీలోని ఒక రహస్య ప్రాంతంలో తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో పర్యవేక్షణలో ఉన్న గణపతి, మరికొద్ది రోజుల్లోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయే అవకాశం ఉంది. నక్సలిజం అంతమే లక్ష్యంగా సాగుతున్న 'ఆపరేషన్ కగార్' నేపథ్యంలో, గణపతి లొంగుబాటుతో దేశంలో మావోయిస్టు శకం దాదాపు ముగిసినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.*

-ముద్ర డెస్క్

## నాడు వైఎస్.. నేడు రేవంత్

హైకమాండ్ అభిప్రాయాన్ని పక్కనపెట్టి వేం నరేందర్ రెడ్డికి అవకాశం

విధేయతకు రివార్డ్.. రాజ్యసభకు రేవంత్ నమ్మకస్తుడు

# విధేయతకు రాజ్యాభిషేకం!

### వైఎస్-కేవీపీ రాజకీయాన్ని గుర్తు చేసిన తాజా పరిణామం

సింఘ్వీకి మళ్లీ ఛాన్స్.. జాతీయ స్థాయిలో పార్టీకి బలం


- రెడ్డి వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని రేవంత్ పట్టుదల
- రాజ్యసభ రేసులో చివరకు రేవంత్ మాటే ఫైనల్
- కాంగ్రెస్‌లో విధేయతకు గుర్తింపు అనే చర్చ
- ప్రియాంక మద్దతున్న పేరును కాదన్న తెలంగాణ సీఎం
- హస్తినలో లాబీయింగ్.. చివరికి వేం నరేందర్ రెడ్డికి టికెట్
- బీఆర్ఎస్ పోటీ లేకుండా ఎన్నిక దాదాపు ఖాయం

**ముద్ర, తెలంగాణ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుత రాజకీయాల్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని గుర్తుకు తెచ్చారు. ఆనాడు కూడా పార్టీలోని నేతలంతా ఒకవైపు నిల్చుండి ఆనాటి సీఎం వైఎస్ ఆత్మగా పేరున్న కేవీపీకి వ్యతిరేకంగా చేసినా.. వైఎస్ మాత్రం పట్టుబట్టి సాధించుకున్నారు. ఇప్పుడు కూడా అదే తరహా రాజకీయం కనిపించింది. పార్టీ నేతలే కాదు.. హైకమాండ్‌లోని ప్రియాంక గాంధీ కూడా సపోర్ట్ చేసిన నేతను కాదని.. వేం నరేందర్ రెడ్డి కోసం పట్టుబట్టిన రేవంత్ రెడ్డి.. తన మాటే నెగ్గించుకున్నారు. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డిని హైకమండ్ ఖరారు చేయడం, నామినేషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో ఈ రాజకీయ ప్రచారం జోరందుకుంది. వేం నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని సీఎం రేవంత్ పట్టుబట్టి మరీ సాధించుకున్నట్లు స్పష్టమవుతోంది.

**సింఘ్వీకి మరో అవకాశం**

గతంలో ఉప ఎన్నిక ద్వారా తెలంగాణ నుంచి పెద్దల సభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ పదవీ కాలం ముగిసినప్పటికీ.. మళ్లీ ఆయనకే ఇచ్చారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి కీలక న్యాయవాదిగా, ట్రబుల్ షూటర్‌గా ఉన్న ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని పార్టీ మళ్లీ ఆయనకే మొగ్గు చూపింది. రాష్ట్ర నాయకత్వం కూడా సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని బలపరిచింది. గత కొంతకాలంగా పార్లమెంట్‌లో పార్టీ వాణిని బలంగా వినిపించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో రాష్ట్ర కోటా మిగతా 02లో



## స్వ 'భద్ర'మేనా'



### తెలంగాణ సీపీఎం గతమెంతో ఘనం

- పొత్తు రాజకీయాలతో సొంత ఓటు బ్యాంక్ కు దెబ్బ
- యువతను ఆకర్షించలేక పాతకాలపు ప్రచారం
- అంతా వీరభద్రం రాజకీయమేనా..?

10

## డబ్బు మూటల కోసమే మూసీ సుందరీకరణ



### బీఆర్ఎస్ నేత కేటీఆర్

- కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు అయినా
- విధ్వంసం లేకుండా మూసీ అభివృద్ధి సాధ్యమే
- మూసీ పేరుతో ఇళ్ల కూల్చివేతలు ఆపాలి

03


# హస్తం జోరు.. కారు బ్రేకు

- పోటీ చేస్తామన్న ప్రకటనలు.. చివరకు వెనక్కి
- కేసీఆర్ ఫామ్ హౌస్ రాజకీయాలు.. ఫీల్డ్‌లో కాంగ్రెస్ ఆధిక్యం
- అభిషేక్ సింఘ్వీకి మరో అవకాశం.. నరేందర్ రెడ్డి రెండో అభ్యర్థి
- ఆశావాహుల ఆశలు మళ్లీ అర్ధాంతరంగా నిలిచినట్లే
- కాంగ్రెస్ కాన్ఫిడెన్స్ పెరుగుతుండగా.. గులాబీ శిబిరంలో సందిగ్ధం
- ఎన్నికల ముందు హడావిడి.. చివరికి పోటీ నుంచి తప్పుకోవడం

02

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ దూకుడు.. బీఆర్ఎస్ పోటీకి దూరం

సంఖ్యాబలం లేక వెనక్కి తగ్గిన గులాబీ పార్టీ




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఈ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగియగా.. మొత్తం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయగా స్వతంత్ర అభ్యర్థిగా సాయి అనే వ్యక్తి నామినేషన్ వేశారు. అభిషేక్ సింఘ్వీ మూడు సెట్లు, వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్లు, సాయి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే స్వతంత్ర అభ్యర్థి 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా నామినేషన్ వేయడంతో స్క్రూటినీలో అది తిరస్కరణకు గురి కానుంది. దీంతో సింఘ్వీ, వేం నరేందర్ ఏకగ్రీవం లాంఛనం కానుంది. అంతకు ముందు ఏఐసీసీ ముఖ్య ప్రతినిధి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డి గురువారం ఉదయం అసెంబ్లీ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి తమ నామినేషన్ సెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రిమండలి సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ శ్రేణుల కోలాహలంతో అసెంబ్లీ ప్రాంగణం సందడిగా మారింది. నామినేషన్ అనంతరం అభ్యర్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మను మిగతా 02లో

# తెలంగాణలో రాజ్యసభ ఏకగ్రీవం?

### కాంగ్రెస్ ఖాతాలోకే రెండు స్థానాలు



- కాంగ్రెస్ తరఫున నామినేషన్లు దాఖలు చేసిన సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి
- స్వతంత్ర అభ్యర్థిగా సాయి నామినేషన్
- పది మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండానే సాయి నామినేషన్ దాఖలు
- స్క్రూటినీలో తిరస్కరణకు గురయ్యే అవకాశం
- ఖర్గే, రాహుల్, సోనియాకు కృతజ్ఞతలు

# జీహెచ్ఎంసీకి రుణ విముక్తి

### బల్దియా రూ.4,780 కోట్ల అప్పులు సర్కార్ టేకోవర్

- త్రి కార్పొరేషన్లపై ఆర్థిక భారం లేకుండా చర్యలు
- అభివృద్ధి పనులకే భారీగా పెరిగిన అప్పులు
- ప్రతి నెల రూ.100 కోట్ల వడ్డీ భారం
- కొత్త కార్పొరేషన్లకు ఊరట ఇచ్చిన ప్రభుత్వం
- హైదరాబాద్ అభివృద్ధికి అడుగులు


10




గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పుల ఊబి నుంచి బయటపడనుంది. నగరాభివృద్ధి కోసం తీసుకున్న సుమారు రూ. 4,780 కోట్ల రుణ భారాన్ని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సంచలన నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తున్న నేపథ్యంలో, కొత్తగా ఏర్పడే బాడీలపై ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సర్కార్ ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది.

ముద్ర

జనాభా పెంచాలని.. ఇక నుంచి ఒకరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు అని పిల్లలను కనండంటూ ఏపీ సీఎం చంద్రబాబు ఏపీ అసెంబ్లీలో ప్రకటించారు.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 06.03.2026
www.mudranews.in | @mudranews



వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు
WhatsApp
చాట్ మెసేజింగ్
వాట్సాప్ ద్వారా వెంటనే టెక్స్ట్ మెసేజులు పంపుకో వచ్చు. ఇంటర్నెట్ ఉన్నంత వరకు ప్రపంచంలో ఎక్కడికైనా క్షణాల్లో సందేశాలు చేరుతాయి.

# హస్తం జోరు.. కారు బ్రేకు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిస్థితి మేకపోతు గాంభీర్యంగా మారింది. ఎన్నికలైనా.. ఎజెండా ఏదైనా ముందుగా మేమే చేస్తాం అంటూ చెప్పుకురావడం.. చివరకు చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. కాంగ్రెస్ పరువు తియ్యాలని బీఆర్ఎస్ ఎంతగా ప్రయత్నిస్తున్నా.. పరిస్థితులు ఆ పార్టీకే కలిసొస్తున్నాయి. మొన్నటి మున్సిపల్ ఎన్నికల తర్వాత మరోసారి కాంగ్రెస్‌లో రాజ్యసభ ఎన్నికల సందడి కనిపిస్తోంది.


**అనుకున్న రాజకీయమే..**
ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు అంతా బాగుంటుంది. ఒక్కసారి పవర్ పోతే.. గాలి తీసిన బెలూన్‌లా అయిపోతాయి పార్టీలు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అలాగే తయారైంది. పదేళ్లపాటూ అధికారంలో ఉండి.. చాలా ఎన్నికల్లో అవలీలగా గెలిచిన బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్‌కి కనీ సంపోటీ ఇవ్వలేకపోతోంది. రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉంటోంది. మరోవైపు, అత్తెసరు సీట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాత్రం జరిగే ప్రతి ఎన్నికలోనూ పాజిటివ్ ఫలితాలు తెచ్చుకుంటూ ముందుకి వెళ్తోంది. తాజాగా రాజ్యసభ స్థానాల విషయంలోనూ ఇద్దరు అభ్యర్థులను బరిలో దింపుతూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కి షాక్ ఇస్తోంది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ తరపున ఇద్దరు రాజ్యసభ సీట్లకు నామినేషన్ వేశారు. పార్టీ హైకమాండ్.. సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీకి రెండోసారి అవకాశం ఇచ్చింది. ఆయన ఇప్పటికే ఒకసారి రాజ్యసభకు ఎన్నికై అనుభవశీలిగా మారారు. ఈసారి కూడా కాంగ్రెస్ ఆయన అనుభవాన్నీ, జాతీయ స్థాయి గుర్తింపునూ దృష్టిలో ఉంచుకుని రెండో అవకాశం కల్పించింది. దీనిపై రాజస్థాన్‌కి చెందిన అభిషేక్ మను సింఘ్వీ పార్టీకి ధన్యవాదాలు చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి తాను కృషి చేస్తానని అన్నారు. ఇక మరో అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డి నామినేషన్ వేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బలమైన స్థితిలో ఉండటంతో ఈ ఇద్దరు నామినేషన్లూ పార్టీ బలాన్ని స్పష్టంగా చాటుతున్నాయి. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో కాంగ్రెస్ ఆధిక్యతను నిలబెట్టుకోవడానికి ఇది సహాయపడుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**బీఆర్ఎస్ సంగతి ఏంటి?:**
ఏ ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయం అని కేటీఆర్ తరచూ అంటున్నారు. ఇలా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో ఆయన ప్రచారం చేశారు. కానీ కాంగ్రెస్ బలపడుతోంది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి కంటే ఇప్పుడు మరింత ఎక్కువ కాన్ఫిడెన్స్‌తో ఉంది. మరోవైపు ప్రజలతో తరచుగా కలవని కేసీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే ఉంటూ అక్కడి నుంచే రాజకీయ వ్యవహారాలు చూస్తుంటే.. ఫీల్డ్ మీద కేటీఆర్, హరీశ్ రావు జోరుగా ఉన్నట్లు కనిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, ఆ పార్టీలో కేసీఆర్ ప్రజల మధ్యకు రాని లోటు కనిపిస్తూనే ఉంది. ఎన్నికల్లో ప్రజలు.. ఈ లోటు కారణంగానే.. కాంగ్రెస్ వైపు చూస్తున్నారనే విశ్లేషణలు వస్తున్నాయి.

**బలం లేని నిరూపణ**
రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీ పెట్టడానికి బీఆర్ఎస్ పార్టీకి తగినంత సంఖ్యాబలం లేదు. తెలంగాణ శాసనసభలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు సరిపడా సీట్లు లేకపోవడంతో రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. గతంలో రాష్ట్రంలో ఆధిపత్యం చెలాయించిన బీఆర్ఎస్.. ఇప్పుడు కనీసం అభ్యర్థులను పోటీకి పెట్టలేని పరిస్థితిలో ఉంది. దీని వల్ల బీఆర్ఎస్ బలహీనంగా ఉంది అనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లగలవు. అది ఆ పార్టీకి మైనస్ అవ్వగలదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉంటే.. ప్రధాన ప్రతిపక్షంగా కనిపిస్తున్న బీఆర్ఎస్ అప్పటికీ ఆ పొజిషన్‌ని కాపాడుకుంటే.. అప్పుడు ప్రజలు బీఆర్ఎస్ వైపు చూసే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్ పాలనపై ఇది ఆధారపడి ఉంటుంది. హస్తం పాలన బాగానే ఉంటే.. ప్రజలు మళ్లీ ఛాన్స్ ఇచ్చినా ఇవ్వొచ్చు. లేదంటే.. అసలు ఈ పార్టీలను కాదని బీజేపీ వైపు చూడొచ్చు. లేదా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి అధికారంలోకి రావచ్చు. రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చు. మొత్తంగా తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. కాంగ్రెస్ రెండు సీట్లు సురక్షితంగా సాధించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తుండగా, బీఆర్ఎస్ తన బలహీనతను బయట పెడుతున్నట్లవుతోంది. రాజ్యసభ ఎన్నికలు జాతీయ రాజకీయాలపై కూడా కొంత ప్రభావం చూపే అవకాశం ఉంది.

**పోటీ పేరుతో ఆశావాహుల ఆశ**
బీఆర్ఎస్ నుంచి ఎవరో ఒకరిద్దరు ఇలాంటి స్థానాల కోసం ఆశలు పెట్టుకోవడం సాధారణమే. తాము పోటీ చేస్తామని, ఫిరాయింపు ఎమ్మెల్యేలకు విప్ జారీ చేస్తామని, తమకు ఓట్లు పడుతాయని, తామూ గెలుస్తామంటూ బీఆర్ఎస్ పదేపదే చెప్పుకురావడంతో.. పలువురు ఆశావాహులు ఆశల్లో పడుతున్నారు. కానీ, చివరి వరకూ ఊహించిన బీఆర్ఎస్ అధిష్టానం.. ఆఖరుకు చేతులెత్తేస్తోంది.

**కేడర్ కు ఏం చెప్తారు..?**
పోటీ నుంచి తప్పుకోవడం అలవాటుగా చేసుకున్న బీఆర్ఎస్.. ఇప్పుడు తమ కేడర్ కు ఏం చెప్తుందనేది ముందున్న చర్చ. ఎందుకంటే ప్రస్తుతానికి పార్టీ బాస్ లు మేకపోతు గాంభీర్యాన్ని చూపిస్తున్నారు. తమ బలం ఏమిటో వాళ్లకు తెలుసు. కానీ, తమకే బలమంటూ చెప్పుకుంటున్నారు. ఇదే సమయంలో ఎన్నికల సమయంలో మాత్రం బోల్తా పడుతున్నారు. ఇప్పటికే పార్టీ కేడర్ చాలా ఆయోమయంలో ఉంది. ఇలాంటి పరిస్థితి మరింతగా కుంగదీసే అవకాశాలు ఉన్నాయి.




# విధేయతకు 'రాజ్య'భిషేకం!

(మొదటి పేజీ తరువాయి)
–అయినప్పటికీ.. రాష్ట్ర నేతలు మద్దతుగా ఉండకతప్పలేదు.

**రేవంత్ నమ్మకస్తుడు 'వేం'కు దక్కిన గుర్తింపు**
ఇక రెండో అభ్యర్థిగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డి పేరు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ముఖ్యమంత్రికి రాజకీయ సలహాదారుగా ఉన్న ఆయన, రేవంత్ రెడ్డి కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన వ్యక్తి. పార్టీ కోసం, ప్రభుత్వం కోసం తెర వెనుక ఉండి చక్రం తిప్పుతున్న నరేందర్ రెడ్డికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం రేవంత్ గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచే రెడ్డి వర్గానికి పెద్దగా ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి ఉందని.. ఇటీవల భర్తీ చేసిన పదవులన్నీ ఇతర వర్గాలకే ఇస్తున్నామని ఈ సారి.. రెడ్డి వర్గానికిచాన్స్ ఇవ్వాలన్న వాదన రేవంత్ గట్టిగా వినిపించారు. వేం నరేందర్ రెడ్డికి కాకపోతే ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఇవ్వాలని అనుకున్నారు. అయితే ఆయన ఆసక్తి చూపించలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు.. ఏఐసీసీ నేత వంశీచంద్ రెడ్డి కోసం ప్రియాంక గాంధీ ఒత్తిడి తెచ్చినట్లు హస్తినలో ప్రచారం జరిగింది. కానీ, ప్రియాంక ప్రయత్నాలు విఫలమయ్యాయి.

**విధేయతకు పట్టం**
ఈ ఇద్దరి ఎంపిక ద్వారా కాంగ్రెస్ అటు జాతీయ అవసరాలను, ఇటు స్థానిక సమీకరణలను మేళవించింది. సింఘ్వీ ద్వారా ఢిల్లీ స్థాయిలో పార్టీకి బలం చేకూరుతుండగా, వేం నరేందర్ రెడ్డి ఎంపిక ద్వారా రెడ్డి సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించినట్లయింది. శాసనసభలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న స్పష్టమైన మెజారిటీ దృష్ట్యా, ఈ ఇద్దరు అభ్యర్థుల ఎన్నిక దాదాపు లాంఛనమే కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తమ అభ్యర్థులను నిలబెట్టకపోవడంతో వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నిక లాంఛనమే.

# 60 శాతం పోలింగ్.. నేపాల్‌లో అధికారం ఎవరిది?

**ముద్ర డెస్క్:**
నేపాల్ రాజకీయాల్లో మరో కీలక అధ్యాయం ప్రారంభమైంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రారంభమవడంతో మొత్తం 275 పార్లమెంట్ స్థానాలకు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. సుమారు 18.9 మిలియన్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొంటుండగా సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. అనంతరం 24 గంటల్లోనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే ఈ ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం యువత ముఖ్యంగా జనరేషన్–జెడ్ ఓటర్ల ప్రభావం. ఇటీవలి సంవత్సరాల్లో నేపాల్ రాజకీయాల్లో యువత పాత్ర గణనీయంగా పెరిగింది. గత ఏడాది సోషల్ మీడియాపై విధించిన నిషేధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా జెన్ జెడ్ యువత పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. ఈ ఉద్యమం కేవలం ఆన్‌లైన్ ఆగ్రహంగా మాత్రమే మిగలకుండా రోడ్లపైకి వచ్చి పెద్ద ప్రజా ఉద్యమంగా మారింది. ఫలితంగా అప్పటి ప్రధాని కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొని చివరకు అధికారాన్ని కోల్పోయింది. ఈ సంఘటన యువత రాజకీయ ప్రభావాన్ని స్పష్టంగా చూపించింది. ఇప్పటి ఎన్నికల్లో అదే యువత ఓటు కీలకంగా మారింది. ముఖ్యంగా సోషల్ మీడియా, డిజిటల్ వేదికలపై చురుకుగా ఉండే జెన్ జెడ్ యువత రాజకీయాలపై తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేస్తోంది. వారు కేవలం సంప్రదాయ రాజకీయాలను కాకుండా పారదర్శకత, అవినీతి నిరోధం, ఉపాధి అవకాశాలు, డిజిటల్ స్వేచ్ఛ వంటి అంశాలను ప్రాధాన్యంగా చూస్తున్నారు. అందువల్ల రాజకీయ పార్టీలు కూడా తమ ప్రచార వ్యూహాలను యువతను ఆకట్టుకునే విధంగా మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేపాల్ రాజకీయాల్లో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే యువత ఓటు బ్యాంక్ ఏ ఒక్క పార్టీకి పూర్తిగా కట్టుబడి ఉండడం లేదు. వారు వ్యక్తులు, విధానాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి ఓటు వేయాలని భావిస్తున్నారు. దీంతో సంప్రదాయ పార్టీలు తమ పాత రాజకీయ విధానాలను మార్చుకొని యువత ఆశయాలకు అనుగుణంగా ముందుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికలు కేవలం ప్రభుత్వ మార్పు కోసం జరిగే సాధారణ ఎన్నికలుగా కాకుండా, నేపాల్ రాజకీయాల్లో కొత్త తరం ఆలోచనలకు మార్గం చూపే ఎన్నికలుగా భావిస్తున్నారు. ముఖ్యంగా జెన్ జెడ్ ఓటర్లు తమ ఓటు ద్వారా రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకురావాలని చూస్తున్నారు.



**నేపాల్ ఎన్నికల్లో 60 శాతం పోలింగ్**
నేపాల్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సుమారు 60 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 1.9 కోట్ల మంది ఓటర్లలో ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఎక్కువ ప్రాంతాల్లో ప్రశాంతంగా సాగింది. అయితే డోలఖా జిల్లాలో ప్రారంభంలో స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎన్నికలను బహిష్కరించగా, మరికొందరు ఓటు వేయడానికి గంటల పాటు నడిచి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను పరిపాలనా కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. ఉత్తర పర్వత ప్రాంతాల నుంచి బాక్సులను తరలించేందుకు హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. ఈ వారాంతంలో ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతి సమస్యలు, భారత్–చైనా దేశాలతో సంబంధాల నిర్వహణ ప్రధాన సవాళ్లుగా ఉండనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈసారి నేపాల్ ఎన్నికల్లో విజయం సాధించేది కేవలం రాజకీయ వ్యూహాలపై మాత్రమే ఆధారపడదు. యువతను అర్థం చేసుకుని, ఆశయాలకు అనుగుణంగా స్పందించే పార్టీలకే అధిక మద్దతిచ్చే అవకాశముంది. అందువల్ల ఈ ఎన్నికలు నేపాల్ రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాకుండా ప్రపంచానికి మరోసారి చాటిచెప్పే అవకాశం ఉంది.

# తెలంగాణలో రాజ్యసభ ఏకగ్రీవం..?



(మొదటి పేజీ తరువాయి)
సింఘ్వీ మాట్లాడుతూ.. తెలంగాణ తరపున రెండోసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇదిలావుంటే దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాల భర్తీ కోసం నామినేషన్లు గత నెల 26న మొదలయ్యాయి. ఈ నెల 6న అధికారులు అన్ని నామినేషన్లు పరిశీలిస్తారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు ఈ నెల 9 వరకు అవకాశం ఉంది. ఏకగ్రీవం కాని పక్షంలో అవసరమైతే ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్లు లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

**బీఆర్ఎస్ కు ఎదురుగాలి**
పదేళ్లు తెలంగాణలో ఏకచత్రాధిపత్యం కొనసాగించిన బీఆర్ఎస్ కు క్రమంగా ఎదురుగాలి వీస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో రాజ్యసభ పోటీకి బీఆర్ఎస్ దూరంగా ఉంది. ఖాళీ అయిన రెండు స్థానాల్లో సురేశ్ రెడ్డి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ కాగా తాజాగా ఇప్పుడు ఆ స్థానాన్ని గులాబీ పార్టీ కోల్పోనుంది. ముగ్గురు అభ్యర్థులు పోటీ చేస్తే కనీసం 40 ఓట్లు సాధించే అభ్యర్థులు రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధిస్తారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 39 మంది బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. సంఖ్యా బలం లేకపోవడంతో బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంది.

# ప్రేమలో కొత్త వెరైటీ ఘోస్ట్ లైటింగ్

**ముద్ర డెస్క్:**
నిన్నటి వరకు ప్రేమలో మునిగి తేలి, ఇవాళ అడ్రస్ లేకుండా పోయే 'ఘోస్టింగ్' పాత మోడల్ అయిపోయింది. ఇప్పుడు మార్కెట్లోకి 'గోస్ట్ లైటింగ్' అనే లేటెస్ట్ సాఫ్ట్‌వేర్ వచ్చేసింది. ఇందులో స్పెషాలిటీ ఏంటంటే.. అవతలి వ్యక్తి మిమ్మల్ని మోసం చేస్తూ దొరికిపోయినా, 'అసలు నీ కళ్లే సరిగ్గా చూడలేదు, నీ బుర్ర పని చేయడం లేదు" అని నమ్మించి, చివరికి మిమ్మల్నే మోకాళ్లపై నిలబెట్టి సారీ చెప్పిస్తారు!



**ఆపరేషన్ మానిప్యులేషన్**
ఈ గోస్ట్‌లైటింగ్ బాధితుల పరిస్థితి ఎలా ఉంటుందంటే, సినిమాలో విలన్ కొడుతుంటే హీరో 'ఎందుకు కొడుతున్నావ్?' అని అడగాలి. కానీ ఇక్కడ హీరో, "నన్ను కొడుతున్నందుకు నీ చెయ్యి నొప్పి పుడుతుందేమో, ఐ యామ్ సారీ" అని విలన్‌కి మందు రాసినట్టు ఉంటుంది. వారు రిప్లై ఇవ్వరు.. ఎందుకు అని అడిగితే, "నువ్వు మరీ ఇంత పొసెసివ్‌గా ఉంటే నేను బ్రతకలేను" అని రివర్స్ లో డైలాగులు కొడతారు. "నేను అలా ఎప్పుడూ అనలేదు, నీకేదో భ్రమగా ఉంది" అని చెప్పి, ఉన్న నిజాన్ని కూడా అబద్ధం చేసేస్తారు. పాపం బాధితులు నిజంగానే గజినీ లాగా తమ మెమరీని తామే అనుమానించుకుంటారు. అకస్మాత్తుగా మాయమైపోయి, మళ్ళీ ఎప్పుడో తీరిగ్గా వచ్చి "నువ్వు బిజీగా ఉన్నావని నేనే డిస్టర్బ్ చేయలేదు" అని బిల్డప్ ఇస్తారు. అంటే మాయమైంది వాడు, తప్పు మాత్రం మీదే!

**ప్రమాద హెచ్చరిక**
మీ పార్ట్నర్ కింది లక్షణాలు చూపిస్తుంటే, మీరు ప్రేమలో లేరు.. ఒక 'సైకలాజికల్ థ్రిల్లర్' సినిమాలో ఉన్నారని అర్థం చేసుకోండి. తప్పు చేసినా వాళ్ల ముఖంలో అపరాధ భావం అస్సలు ఉండదు. మీరు ఏదైనా అడిగితే "నీకు పిచ్చి పట్టింది" అని ఈజీగా అనేస్తారు. మీ ఆత్మగౌరవం ఐస్‌క్రీమ్‌లా కరిగిపోతుంటే వెంటనే అలర్ట్ అవ్వండి. ప్రేమ అనేది ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి మీద ఒకరు సిఐడి ఇన్వెస్టిగేషన్లు చేసుకోవడానికి కాదు. ఎవడో 'గోస్ట్' లాగా మాయమై, మిమ్మల్ని 'లైట్'లో పెట్టి ఆడుకుంటుంటే.. ఆ లైట్ తీసి వాడి నెత్తి మీద పెట్టి, సాగనంపడమే ఉత్తమం. మానసిక ప్రశాంతత ముఖ్యం బిగులు! ఎవడో అబద్ధాలకోరు కోసం మీ మెదడుని ఫ్రై చేసుకోకండి. మీ ఆత్మగౌరవాన్ని కాపాడుకోండి, లేదంటే మీ జీవితం ఓ 'హారర్ కామెడీ' అయిపోతుంది!

# బూతు.. సోషల్ మీడియాలో దారుణమైన వైరస్!

**ముద్ర డెస్క్ :**
ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో అశ్లీల, అసభ్యకర కంటెంట్ విపరీతంగా పెరుగుతోంది. ఒకప్పుడు వినోదం, సమాచారానికి ఉపయోగపడిన ఈ వేదికలు ఇప్పుడు అనేక వివాదాస్పద దృశ్యాలు, వీడియోలతో కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా యువతపై వీటి ప్రభావం ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్), యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో అసభ్యకర కంటెంట్‌ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆల్గారిథంలను ఉపయోగిస్తున్నప్పటికీ, కొంతమంది వినియోగదారులు వాటిని మోసం చేసే మార్గాలను ఉపయోగిస్తున్నారు. కోడ్ భాష, ఫిల్టర్లు వాడటం ద్వారా ఈ కంటెంట్ సిస్టమ్‌లకు చిక్కకుండా వ్యాపిస్తోంది.

టెక్నాలజీ అభివృద్ధితో డీప్‌ఫేక్ వీడియోలు కూడా పెరుగుతున్నాయి. దీనిపై ప్రభుత్వాలు హెచ్చరికలు జారీ చేయడంతో కొన్ని సంస్థలు చర్యలు ప్రారంభించాయి. కొన్ని వేల అసభ్యకర పోస్టులను తొలగించడంతో పాటు అనేక ఖాతాలను బ్లాక్ చేస్తున్నాయి.

అయితే ఈ సమస్యను పూర్తిగా అరికట్టాలంటే కంపెనీలు మాత్రమే కాకుండా యూజర్లు కూడా బాధ్యతగా వ్యవహరించాలి. సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ వంటి సెట్టింగ్స్ ఉపయోగించడం ద్వారా అసభ్యకర కంటెంట్‌ను కొంతవరకు తగ్గించుకోవచ్చు. అలాగే ప్రభుత్వాలు కఠిన నిబంధనలు అమలు చేస్తే సోషల్ మీడియాలో పెరుగుతున్న ఈ బూతు కంటెంట్ ముప్పును నియంత్రించడం సాధ్యమవుతుంది.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు

### వాయిస్ కాల్స్

వాట్సాప్‌లో ఉచితంగా వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. మొబైల్ నెట్ లేదా వైఫై ఉంటే ఎవరితోనైనా మా-ట్లాడవచ్చు.



# హత్య కేసులో ముగ్గురికి పదేళ్లు జైలు



**ముద్ర, శేరిలింగంపల్లి :**

మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు తీర్పు వెలువరించిందని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర ప్రసాద్ మిశ్రా (29), ధర్మేంద్ర ప్రసాద్ మిశ్రా (45), బీరేంద్ర ప్రసాద్ మిశ్రా (37) అన్నదమ్ములు మాదాపూర్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో అద్దె గదిలో నివాసం ఉండేవారు. 18 నవంబర్ 2016న వీరి మధ్య జరిగిన గొడవలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రాపై ముగ్గురు నిందితులు కత్తి మరియు కిటికీ గాజు పలకతో దాడి చేశారు. ఈ దాడిలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రా గొంతు వద్ద తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 701/2016గా కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అనంతరం పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ పూర్తి చేసిన రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు ఆరవ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి సి. పావని నిందితులు ముగ్గురినీ దోషులుగా తేల్చి, ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని డీసీపీ తెలిపారు.

# జోక్యం చేసుకోండి

- **గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై అభ్యంతరాలు, ఆందోళనలు**
- **ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షికి మూసీ జన్ ఆందోళన్ లేఖ**




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మూసీ నది ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు విషయంలో జోక్యం చేసుకోవాలని ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్‌కు మూసీ జన్ ఆందోళన్ లేఖ రాసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ గ్రామంలో 10.34 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం సంకల్పించిందని ఇది మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్ నివాసులను ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా తెలంగాణ ప్రభుత్వం98.20 ఎకరాల రక్షణ శాఖ భూమిని బదిలీ చేయమని కోరడంతో పాటు ఈ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను గత నెల 12న స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారని తెలిపారు. ప్రజల వ్యతిరేకతను, ప్రజాస్వామ్య ప్రక్రియలను పట్టించుకోకుండా ఇలా చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రతిపాదిత మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగమైన 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్' విషయంలో మేము తీవ్ర అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నామని చెప్పారు.. సివిల్ సొసైటీ కార్యకర్తలు, పర్యావరణ వాదులు, మానవ హక్కుల సంస్థలు, స్థానిక నివాసితులతో కూడిన ఈ నెట్వర్క్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్య చర్చల ద్వారా పూర్తి సమీక్ష చేయాలన్నారు. ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవాలని మీనాక్షి నటరాజన్‌ను కోరారు. విగ్రహం ఏర్పాటును మహాత్మా గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారని లేఖలో ప్రస్తావించారు. 2013 భూసేకరణ చట్టం కింద సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ నుండి ఈ ప్రాజెక్టుకు మినహాయింపు ఇవ్వడాన్ని ఎంజేఏ ఖండిస్తోందని 2017లో రాష్ట్ర సవరణ ద్వారా ఈ చట్ట ఉద్దేశాన్ని, ప్రజల ప్రయోజనాలను, ఆహార భద్రతను దెబ్బ తీస్తున్నారని పేర్కొంది. ప్రస్తుత విధానం నది పర్యావరణ వ్యవస్థకు, తెలంగాణ సమాజానికి శాశ్వత హానికర పరిణామం హెచ్చరిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుత రూపంలో కొనసాగితే మన సహజ వారసత్వానికి తిరిగి రాని నష్టం కలిగిస్తుందని గుర్తించాలన్నారు. స్థానిక ప్రజలలో ఉన్న ఈ అసంతృప్తిని రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ అధిష్టానానికి తెలియజేయాలని మీనాక్షిని కోరారు.

# టోలీచౌకీలో ఘోర ప్రమాదం

- **5 అంతస్థుల భవనం కూలి నలుగురు మృతి**
- **ఇంకా తేలని మృతుల వివరాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లో ఘోర విషాదం చోటు చేసుకుంది. ఐదు అంతస్థుల భవనం కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరికొంత మంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలిసిన పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. హైదరాబాద్‌లో మరో విషాదకరమైన ఘటన జరిగింది. టోలీచౌకీ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోవడంతో అక్కడే పనిచేస్తున్న నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ఘటనలో మరింత మంది కార్మికులకు కూడా తీవ్ర గాయాలు కావడంతో.. వారిని హుటాహుటిన దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. టోలీచౌకీ అల్ హస్నాత్ కాలనీలో నిర్మాణంలో ఉన్న 5 అంతస్థుల భవనం కూలిపోవడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. గాయపడిన వారిలో కొందరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక భవనం కూలిన ఘటనకు సంబంధించిన విషయం తెలిసిన వెంటనే పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన సహాయక చర్యలు మొదలుపెట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. కొత్త భవనానికి గోవా కర్రలు కట్టి.. వాటిపై నిలబడి కార్మికులు పనులు చేస్తుండగా.. అకస్మాత్తుగా ఆ కట్టెలు కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.







# మూసీ పేరుతో విధ్వంసం

- **చేతకాకపోతే ఆ బాధ్యత మాకు అప్పగించాలి**
- **రెండేళ్లలో హైదరాబాద్ లో ఒక్క ఇల్లయినా నిర్మించారా?**
- **సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రెండున్నరేండ్లలో కాంగ్రెస్ పాలనలో హైదరాబాదులో ఒక్క ఇల్లైనా కట్టించినట్లు నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. మూసీ సుందరీకరణ మీకు చేతకాకపోతే తమకు అప్పజెప్పాలన్నారు. మూసీని ఎలా సుందరీకరించాలో చేసి చూపిస్తామని అన్నారు. ప్రజల ఇళ్లు కూల్చకుండా ఎలాంటి విధ్వంసం చేయకుండా మూసి సుందరీకరణతో అభివృద్ధి చేసి చూపించాలని కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. గురువారం నాగోల్‌లోని ఎస్టిపి ప్లాంట్‌ను సందర్శించిన ఆయన మూసి పరివాహక ప్రాంత నివాసులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూసి తీరంవెంట ఐదున్నర కిలోమీటర్లు సుందరీకరణ చేసినట్లు తెలిపారు. నాగోల్‌లో ఏర్పాటు చేసిన ఎస్టీపీ ప్లాంటు 320 ఎంఎల్డీతో భారతదేశంలోనే అతిపెద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మూసీనీటిని శుద్ధిచేసినట్లు తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ప్రతిరోజు 2 వేల మిలియన్ మురుగు నీరు మూసీనదిలో ప్రవహిస్తుందని తెలిపారు. మూసీ నదిని జీవనదిగా మార్చడానికి కేసీఆర్ పునాది వేసినట్లు పేర్కొన్నారు. తాము రూ.3866 కోట్లతో 32 సేవరేజి ప్లాంట్లకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2023 డిసెంబర్ ఎన్నికల నాటికి 85శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ప్రతి మురికి నీటిచుక్క గ్రావిటీ ద్వారా వచ్చి శుద్ధిచేయబడాలని చేశామని వివరించారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా రూ.1100 కోట్లతో గోదావరి నీటిని గండిపేట చెరువులోకి తీసుకొచ్చి ఆ నీటిని మూసిలోకి వదిలితే ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదని వివరించారు. మూసీనదిపై 15 బ్రిడ్జిలను నిర్మించాలని అప్పట్లో నిధులు మంజూరు చేశామని చెప్పారు. తద్వారా చెక్ డ్యాములు పెట్టి నీటిని శుద్ధిచేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లాకు శుద్ధి జరిగిన నీరు వెళ్లడం ద్వారా రైతులకు న్యాయం జరిగేదని ఆదిశగా తాము రూపకల్పన చేసినట్లు వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా ఐదు కిలోమీటర్లు మూసి సుందరీకరణ చేసి నాగోల్‌లో 10 ఎకరాల విశాలమైన స్థలంలో రూ. 30 కోట్లతో శిల్పారామం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము మూసి సుందరీకరణకు రూ.16 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన ప్రారంభంలో లక్షయాభై వేల కోట్లతో సుందరీకరణ చేస్తామని అనడం ప్రజాధనాన్ని లూటీ చేయడమేనని పేర్కొన్నారు. ఎలాంటి డిపిఆర్ రిపోర్టు లేకుండా ప్రణాళిక లేకుండా మూసి పరివాహక ప్రాంతంలో ఉన్న నివాసాలకు రెడ్ మార్కులు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లో బుల్డోజర్ సర్కారు నడుస్తుందని మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. మరి ఖమ్మంలో పేద ప్రజల ఇండ్లు కూల్చడం ద్వారా కాంగ్రెస్ బుల్డోజర్ సర్కారు కాదా అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్‌లో 150 మంది వికలాంగులను మెడలుపట్టి బయట గెంటేసి ఇండ్లు కూలగొట్టడం రాహుల్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. హైడ్రా పేరిట చేసే అరాచకాలకు హైదరాబాదులో అంతేలేదని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో సీఎం రేవంత్ రెడ్డి కట్టుకున్న ఇల్లు రెడ్డికుంటలో లేదా అది వాస్తవం కాదా చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి దుర్గం చెరువులోని ఎఫ్ టి ఎల్ లో ఇల్లు కట్టుకున్నాడని, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి బఫర్ జోన్‌లో ఇండ్లు కట్టుకుంటే అవి కనిపించడం లేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి పేద ప్రజల జోలికి పోతున్నావు.. వారు ఊరుకోరని హెచ్చరించారు. కుర్చీ మడతపెట్టి కొట్టే సమయం వస్తుందని అప్రతమతం చేశారు. మూసీ పేరిట లూటీ చేస్తామంటే తాము ఊరుకునేది లేదని అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు పి. సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేష్, ముప్పిడి గోపాల్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్, లింగాల రాహుల్ గౌడ్, అనంతుల రాజిరెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జీవి సాగర్ రెడ్డి, పోచంపల్లి రాజేందర్ రెడ్డి, పల్ల శిల్పారెడ్డి, మాజీ కార్పొరేటర్లు డివిజన్ల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## డబ్బు మూటల కోసమే మూసీ సుందరీ కరణ

**ముద్ర, కాప్రా :**

కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రక్షాళనపై కనీస పాలసీ, ఒక విధానం లేదని, కేవలం డబ్బు మూటల కోసమే ప్రణాళిక రూపొందిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలకు బాధితులైన కుటుంబాలతో కలిసి నాగోల్, ఉప్పల్ ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగోల్‌లో నిర్మించిన దేశంలోనే అతిపెద్ద సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నాగోల్‌లో అభివృద్ధి చేసిన మూసీని కేటీఆర్ పరిశీలించారు. తమ హయాంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ఆధునిక రహదారులు, ఫ్లైఓవర్లు, స్టార్టప్ ఎకోసిస్టమ్, అంతర్జాతీయ పెట్టుబడులు——ఇవి నగరాన్ని గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టాయని అన్నారు. నిత్యం అబద్ధాలు చెబుతూ ఇళ్లను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తమ సొంత మంత్రులు, ప్రజా ప్రతినిధులకు ఉన్న ఫార్మ్‌హౌస్‌లు, విల్లాలు, ఇళ్లను ఎందుకు ముట్టుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ నడుపుతున్నాడని, అందుకే ఇన్ని రకాల ఇబ్బందులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి లాంటి భూ బకాసురుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి . మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి .బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

- **తీవ్రవాద ప్రాబల్యం తగ్గిపోయింది**
- **గత ఐదేళ్లలో 10 వేల మంది జనజీవన స్రవంతిలో కలిశారు**
- **అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లోనూ పురోగతి**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



**ముద్ర, అస్సోం:**

అస్సోం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రాయోజిత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు వేగవంతంగా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో గత ఐదేళ్లలో అస్సోంలో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని, దాదాపు 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి అందిస్తున్న సహాయ పునరావాస కార్యక్రమాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల వివరాలపైనా కేంద్ర మంత్రి ఆరా తీశారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న బండి సంజయ్ కుమార్ గురువారం అస్సాం రాష్ట్ర రాజధానిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అక్కడి రాష్ట్ర అతిథి గృహంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని దిమా హసావో జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో ఒక్క చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ఏకంగా 1 లక్షా 51 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ కేంద్ర మంత్రికి వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందన్నారు. ఒక్క సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుతోనే 27 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏటా వృద్ధి రేటు పెరుగుతోందని, అదే సమయంలో క్రైం రేటు తగ్గుతోందని, కేంద్రం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాల అమలులతోనూ ముందంజలో ఉన్నట్లు వివరించారు. మైనింగ్ రంగంలో చేపట్టిన సంస్కరణలతో దేశంలో అసోం నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలవల్లే అస్సోం రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులను ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయించడంతోపాటు ఆయా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటంతో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయని తెలిపారు. విద్య, పోషణ అభియాన్ నిధులు, వృత్తి విద్యలో అసెస్‌మెంట్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో డాక్టర్ల, పారామెడికల్ సిబ్బంది కొరత ఉందని దీనిని అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35 జిల్లాలుంటే... 14 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని, ఇకపై ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం తప్పనిసరి చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే 3 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు లేవని, ప్రైవేట్ ఆసుపత్రుల సంఖ్య కూడా తక్కువేనని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి ''గుణోత్సవ్'' పేరుతో సీఎం మొదలు కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తున్నామని, దీంతో డ్రాపవుట్స్ తగ్గడంతోపాటు విద్యా ప్రమాణాలు పెరిగాయని తెలిపారు. పీఎంశ్రీ స్కూల్స్ ఏర్పాటుతో విద్యా ప్రమాణాల స్థాయి కూడా పెరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో 27 శాతం పంటలకు మాత్రమే సాగు నీరందుతోందని, ఇక్కడ అన్ని పంటలకు సాగు నీరందించడం పెద్ద సవాల్‌గా మారిందని అధికారులు తెలిపారు. ఆయిల్ ఫాం పంటల సాగు, స్కిల్ డెవలెప్ మెంట్, ఆరోగ్య పథకాల అమలు తీరులోనూ కొంత వెనుకబడి ఉందని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పీఎం ఆవాస్ యోజన పథకంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యంలో 80 శాతం మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన 20 శాతం పనులను సైతం ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని కోరారు. ఈ సమీక్షలో అస్సాం రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ, డీజీపీ హర్మీత్ సింగ్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.




# పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా పొన్నం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడిగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నియమితులయ్యారు. ఆయనతో పాటు కర్ణాటక హెల్త్ మినిస్టర్ దినేష్ గుండురావును ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమిస్తూ కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ గురువారం ఈ ప్రకటన విడుదల చేశారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం. ఇది పుదుచ్చేరి, కారైకల్, మాహె, యానాం నాలుగు జిల్లాలను కలిగి ఉంది. వీటి పరిధిలో 30 శాసన సభ నియోజకవర్గ స్థానాలు ఉన్నాయి. కాగా పుదుచ్చేరి అసెంబ్లీ 15వ సమావేశ కాలం 2026 జూన్ 15తో ముగియనుంది. 2021 ఏప్రిల్లో జరిగిన ఎన్నికల్లో ఎన్ రంగస్వామి నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం 16 స్థానాలతో విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. తాజాగా ఈ కేంద్రపాలిత ప్రాంతంలో కాంగ్రెస్ తన జెండా ఎగురవేయాలని భావిస్తున్నది.

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# డ్రోన్లు, డేటా, దౌత్యం.. ఆధునిక యుద్ధం కొత్త ముఖచిత్రం

### సాంకేతిక శతాబ్దంలో మారిన యుద్ధ స్వరూపం

ఇరవై ఒకటవ శతాబ్దంలో యుద్ధం స్వరూపం మూలాల నుంచి మారిపోయింది. ఒకప్పుడు యుద్ధం అంటే సరిహద్దుల్లో సైన్యాల సమీకరణ, భూమిపై ట్యాంకుల గర్జన, ఆకాశంలో యుద్ధ విమానాల భీభత్సం. నేడు యుద్ధం కనిపించక పోయినా జరుగుతుంది; శబ్దం వినిపించక పోయినా దేశాల వ్యవస్థలను కుదిస్తుంది; సైనికులు కాల్పులు చేయక ముందే శత్రుదేశం మౌలిక సదుపాయాలు స్తంభించి పోతాయి. ఆధునిక యుద్ధం అంటే సాంకేతిక ఆధారిత సమగ్ర దాడి. ఇది భూభాగం మీదే కాదు, సమాచార రంగంలో, అంతరిక్షంలో, ఆర్థిక వ్యవస్థలో, సైబర్ ప్రపంచంలో ఒకేసారి జరుగుతుంది. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే గత రెండు దశాబ్దాల యుద్ధాల పూర్వాపరాలను పరిశీలించాల్సి ఉంటుంది. సోవియట్ విఘటనతో అమెరికా అగ్రశక్తిగా ఎదిగింది. గల్ఫ్ యుద్ధం, ఇరాక్ దాడి, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం వంటి సంఘటనల్లో అమెరికా సాంకేతిక ఆధిక్యం స్పష్టమైంది. ఉపగ్రహ మార్గ దర్శిత క్షిపణులు, ఖచ్చిత లక్ష్య ఛేదన వ్యవస్థలు, గూఢచర్య ఉపగ్రహాలు యుద్ధాన్ని వేగవంతం చేశాయి. 1991 గల్ఫ్ యుద్ధంలో అమెరికా వాడిన ఖచ్చిత లక్ష్య క్షిపణుల శాతం సుమారు ఏడు శాతం మాత్రమే ఉండగా, 2003 నాటికి ఇరాక్ యుద్ధంలో అది అరవై శాతానికి పైగా పెరిగింది. ఇది సాంకేతిక పరిణామ వేగానికి నిదర్శనం. 2001 తర్వాత డ్రోన్ యుద్ధం ప్రారంభమైంది. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో డ్రోన్ దాడులు జరిగాయి. మానవ నష్టం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ విధానం ఇప్పుడు ప్రధాన యుద్ధ వ్యూహంగా మారింది. లాటిన్ అమెరికాలోని వెనిజులా రాజకీయ సంక్షోభం సాంకేతిక యుద్ధం యొక్క మరో రూపాన్ని చూపించింది. అక్కడ ప్రత్యక్ష సైనిక దాడి జరగలేదు; కానీ ఆర్థిక ఆంక్షలు, బ్యాంకింగ్ వ్యవస్థపై నియంత్రణలు, చమురు ఎగుమతుల నిరోధం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు జరిగాయి. సైబర్ దాడుల ఆరోపణలు, విద్యుత్ వ్యవస్థలో అంతరాయాలు కూడా నమోదయ్యాయి. అంటే ఆధునిక యుద్ధం ఎప్పుడూ బాంబుల తోనే జరగదు; ఆర్థిక, సాంకేతిక ఒత్తిడి కూడా యుద్ధమే. మధ్యప్రాచ్యంలో ఇరాన్ పరిస్థితి మరింత సంక్లిష్టం. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నివేదికల ప్రకారం ఇరాన్ యురేనియం శుద్ధి శాతం 60కు పైగా చేరినట్లు గత సంవత్సరాల్లో వెల్లడైంది. అణు ఆయుధ తయారీకి 90 శాతం శుద్ధి అవసరం. ఈ పరిణామం ఇజ్రాయిల్‌కు తీవ్రమైన భద్రతా ఆందోళన. ఇజ్రాయిల్ తన భద్రతను కాపాడేందుకు ముందస్తు దాడులు చేయాలనే సిద్ధాంతాన్ని అనుసరిస్తోంది. 1981లో ఇరాక్ అణు రియాక్టర్‌పై ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడి దీనికి ఉదాహరణ. 2007లో సిరియాలో అనుమానిత అణుకేంద్రాన్ని కూడా ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. ఈ చరిత్రను పరిగణనలోకి తీసుకుంటే ఇరాన్ విషయంలో కూడా సాంకేతిక ఆధారిత గూఢచర్యం, సైబర్ దాడులు, లక్ష్యిత చర్యలు కొనసాగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

**సైబర్ యుద్ధంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఉదాహరణ స్టక్స్‌నెట్ అనే వైరస్.**

స్టక్స్‌నెట్ (Stuxnet) అనేది 2010లో వెలుగులోకి వచ్చిన అత్యంత అధునాతనమైన, ప్రమాదకరమైన కంప్యూటర్ వార్మ్ (worm) మాల్వేర్. ఇది ప్రధానంగా ఇరాన్ అణుకేంద్రాలలోని పారిశ్రామిక నియంత్రణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని, భౌతిక యంత్రాలను (సెంట్రిఫ్యూజ్‌లు) నాశనం చేయడానికి రూపొందించ బడింది. ఇది సైనిక దాడి కాకుండా కంప్యూటర్ కోడ్ ద్వారా చేసిన యుద్ధం. ఈ సంఘటన తర్వాత ప్రపంచ దేశాలు సైబర్ భద్రతపై భారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాయి. నేటి పరిస్థితుల్లో ఒక దేశ విద్యుత్ గ్రిడ్, నీటి సరఫరా, రైల్వే కమ్యూనికేషన్, బ్యాంకింగ్ వ్యవస్థ — సైబర్ దాడులకు గురయ్యే అవకాశం ఉంది. డ్రోన్ యుద్ధం కూడా విస్తరించింది. 2020 జనవరి 3న మధ్యప్రాచ్య రాజకీయాలను కుదిపేసిన ఒక కీలక సంఘటనలో... అమెరికా నిర్వహించిన డ్రోన్ దాడిలో ఖాసిం సొలేమానీ మరణించారు. ఖాసిం సొలేమానీ ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌లోని కుద్స్ దళానికి ప్రధానాధికారిగా ఉన్నారు. ఆయనను ఇరాన్‌లో జాతీయ హీరోగా పరిగణించేవారు. ఈ సంఘటన ఆధునిక యుద్ధంలో లక్ష్యిత హత్యలు ఎలా సాధ్యమవు తున్నాయో చూపించింది. అయితే ఇరాన్ అగ్ర నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ ఖతం టెక్నాలజీ వినియోగానికి తిరుగులేని సాక్ష్యం. ఈ ఉదాహరణలు చూపిస్తున్నది ఏమిటంటే నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాంకేతిక సామర్థ్యం పెరిగింది; కానీ ప్రతి వార్త నిజం కాదని కూడా గుర్తుంచుకోవాలి. సమాచార యుద్ధం లోపల తప్పుడు ప్రచారం కూడా ఆయుధంగానే వాడబడుతోంది. ఇప్పుడు అమెరికా పాత్రను పరిశీలించాలి. అమెరికా ప్రపంచవ్యాప్తంగా సైనిక స్థావరాలు కలిగిన దేశం. దాని రక్షణ వ్యయం ప్రపంచంలోనే అగ్రస్థానం. 2023 అంచనాల ప్రకారం అమెరికా రక్షణ వ్యయం ఎనిమిది వందల బిలియన్ డాలర్లకు పైగా ఉంది. అదే సమయంలో చైనా రక్షణ వ్యయం సుమారు మూడు వందల బిలియన్ డాలర్లకు సమీపంలో ఉంది. రష్యా వ్యయం తక్కువగానే ఉన్నా సైనిక సాంకేతికతలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన దేశం. భారతదేశం కూడా ప్రపంచంలో అగ్ర రక్షణ వ్యయం కలిగిన దేశాల్లో ఒకటి. ఈ గణాంకాలు ప్రపంచంలో శక్తి సమీకరణాలు మారుతున్నాయని సూచిస్తున్నాయి. అమెరికా చర్యలు కేవలం ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్నవేనా అనే ప్రశ్నకు తక్షణ సమాధానం లేదు. మధ్యప్రాచ్యంలో చమురు మార్గాల భద్రత, ఇజ్రాయిల్ రక్షణ, అణువ్యాప్తి నియంత్రణ — ప్రత్యక్ష కారణాలు. కానీ దీని వెనుక గ్లోబల్ శక్తి సమతుల్యత అంశం కూడా ఉంది. చైనా ఆర్థిక ప్రభావాన్ని పెంచుకుంటూ మధ్యప్రాచ్య దేశాలతో సన్నిహిత సంబంధాలు పెంచుతోంది. రష్యా సిరియా యుద్ధంలో సైనికంగా జోక్యం చేసుకుని తన ప్రభావాన్ని చాటింది. ఈ నేపథ్యంలో అమెరికా తన మిత్ర దేశాలకు మద్దతు ఇవ్వడం ద్వారా ప్రత్యర్థి శక్తులకు పరోక్ష సందేశం పంపుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇది ప్రత్యక్ష యుద్ధం ప్రారంభించడమనే అర్థం కాదు; వ్యూహాత్మక ఆధిపత్యాన్ని కాపాడుకోవాలనే ప్రయత్నం. భవిష్యత్తు యుద్ధాలపై దృష్టిపెడితే సాంకేతికత మరింత కీలకం కానుంది. హైపర్సోనిక్ క్షిపణులు శబ్ద వేగం కంటే ఐదు రెట్లు వేగంగా ప్రయాణించ గలవు. ఇవి సంప్రదాయ క్షిపణి నిరోధక వ్యవస్థలకు సవాల్. అంతరిక్షంలో ఉపగ్రహాలపై దాడులు చేసే సామర్థ్యం పెరుగుతోంది. ఉపగ్రహాల ద్వారా కమ్యూనికేషన్, నావిగేషన్, గూఢచర్యం జరుగుతున్నందున వాటి ధ్వంసం ఒక దేశాన్ని అంధుడిని చేయడమే. కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలక ఆయుధాలు మానవ జోక్యం లేకుండానే లక్ష్యాన్ని ఛేదించే స్థాయికి చేరుకుంటున్నాయి. ఇది నైతిక, చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. సమాచార యుద్ధం కూడా భవిష్యత్తులో ప్రధాన రంగం. తప్పుడు వార్తలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, ఎన్నికలపై ప్రభావం చూపే ప్రయత్నాలు — ఆధునిక పోరాట పద్ధతులే. ఒక దేశాన్ని లోపల నుంచే విభజించడం, ప్రజల్లో అనిశ్చితి సృష్టించడం యుద్ధ వ్యూహంలో భాగమవుతోంది. ఆర్థిక ఆంక్షలు, వాణిజ్య నిరోధాలు కూడా యుద్ధ ఆయుధాలుగా మారాయి. ఈ సమగ్ర పరిస్థితుల్లో దేశాల భద్రత అంటే కేవలం సైనిక బలం కాదు. సాంకేతిక స్వావలంబన, సైబర్ రక్షణ, అంతరిక్ష సామర్థ్యం, ఆర్థిక స్థిరత్వం — సమానంగా అవసరం. శత్రువు ఎక్కడి నుంచి దాడి చేస్తాడో తెలియని కాలం ఇది. సరిహద్దు దాటి సైన్యం రాకపోయినా డేటా ద్వారా దాడి జరగవచ్చు. విద్యుత్ నిలిచి పోవచ్చు. బ్యాంకింగ్ వ్యవస్థ కుదేలవచ్చు. ప్రజాభిప్రాయం మారి పోవచ్చు. మొత్తంగా ఆధునిక యుద్ధం ఒక సమగ్ర సాంకేతిక పోరు. వెనిజులా ఉదాహరణ ఆర్థిక సైబర్ ఒత్తిడి రూపాన్ని చూపిస్తే, ఇరాన్ ఉదాహరణ అణు రాజకీయాలు, డ్రోన్ దాడులు, సైబర్ యుద్ధం, దౌత్య ఒత్తిడి — కలిసిన సంక్లిష్ట సమీకరణాన్ని చూపుతోంది. అమెరికా చర్యల వెనుక ప్రాంతీయ భద్రతా అవసరాలే ప్రధాన కారణమని ఒక వాదన; గ్లోబల్ శక్తి సమతుల్యతను కాపాడుకోవాలనే వ్యూహం కూడా భాగమని మరో వాదన. ఏదేమైనా యుద్ధ స్వరూపం శాశ్వతంగా మారిపోయింది. భవిష్యత్తులో దేశాలపై దాడులు వేగవంతంగా, ఖచ్చితంగా, కనీస మానవ నష్టంతో కానీ గరిష్ఠ వ్యూహాత్మక ప్రభావంతో జరిగే అవకాశముంది. ఈ వాస్తవాన్ని అంగీకరించి దేశాలు తమ రక్షణ విధానాలను పునర్ వ్యవస్థీకరించుకోవాల్సిన కాలం ఇది.


రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494



## న_కలం

# గణపతి లొంగుబాటు..

### తెలంగాణలో మావోయిజం కనుమరుగు



దశాబ్దాల రక్తపాతానికి ముగింపు పలికే దిశగా అడుగులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల భేటీ కేవలం సాధారణ పరిపాలనా పర్యటన కాదని, ఇది ఒక చారిత్రక సంధి కాలానికి సంకేతమని అర్థమవుతోంది. దశాబ్దాలుగా సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు పార్టీ, ఇప్పుడు తన ఉనికిని కాపాడుకోలేని క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.

**గణపతి లొంగుబాటు - ఒక శకం ముగింపు:**

80 ఏళ్ల వయస్సు, అనారోగ్యం కారణాలతో ముప్పాల లక్ష్మణరావు (గణపతి) ప్రధాన స్రవంతిలోకి రావాలనుకోవడం మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బ. దశాబ్దాల పాటు పార్టీకి దిశానిర్దేశం చేసిన అగ్రనేత లొంగిపోతే, అది మిగిలిన కేడర్‌లో నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది. నంబాల కేశవరావు మరణం, తిప్పిరి తిరుపతి వంటి నేతల లొంగుబాటుతో పార్టీలో 'వాక్యూమ్' (శూన్యం) ఏర్పడింది. కొత్త తరం నాయకత్వం ఉద్యమాన్ని నడిపించే సత్తా లేకపోవడం, సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు చేస్తున్న ఆపరేషన్లను ఎదుర్కోలేకపోవడం పార్టీ పతనానికి కారణమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఒకే తాటిపైకి రావడం గమనార్హం. కేవలం ఆయుధాలతోనే కాకుండా, పునరావాస ప్యాకేజీలు మరియు అభివృద్ధి మంత్రంతో మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి రప్పించే ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్న గడువులోగా "నక్సలిజం అంతం" అనే లక్ష్యం నెరవేరితే, ఇది దేశ అంతర్గత భద్రతలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. తుపాకీ గొట్టం ద్వారా విప్లవం వస్తుందన్న నినాదం నుంచి, ప్రజాస్వామ్య పద్ధతులే పరిష్కారమన్న దిశగా అగ్రనేతలు ఆలోచించడం ఒక సానుకూల పరిణామం. మార్చి 31న ఒకవేళ అధికారిక ప్రకటన వెలువడితే, అది తెలంగాణ మరియు దండకారణ్య ప్రాంతాల్లో శాంతియుత అభివృద్ధికి కొత్త బాటలు వేస్తుంది.

# జిడిపి వెలుగుల్లో.. సామాన్యుడి బతుకు చీకటి!

**యంత్రాల రాజ్యమేలుతున్న వేళ..**
**మనిషి మనుగడ ప్రశ్నార్థకం!**
**అభివృద్ధి పేరిట విధ్వంసం.. ఇది వృద్ధియా?**
**లేక సామాజిక వినాశనమా?**

ప్రస్తుత భారత ఆర్థిక వ్యవస్థ ఒక విలక్షణమైన, వికృతమైన మలుపులో ఉంది. ఒకవైపు జిడిపి (GDP) అంకెలు ఆకాశాన్ని తాకుతున్నాయని, దేశం ప్రపంచ అగ్రగామిగా ఎదుగుతోందని పాలకులు గణంకాలు చూపిస్తుంటే, మరోవైపు సామాన్యుడి బతుకు భారమై, ఉపాధి దొరక్క వీధిన పడుతున్నాడు. ఇది నిజమైన అభివృద్ధి కాదు, అభివృద్ధి ముసుగులో జరుగుతున్న ఒక వ్యవస్థీకృత సామాజిక విధ్వంసం. ఐక్యరాజ్యసమితి లేదా ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు తమ పట్టును కోల్పోయి, ప్రపంచం ఒక అస్థిరమైన 'నూతన క్రమం' వైపు వెళ్తున్న తరుణంలో, భారతదేశం తన ఆర్థిక రథాన్ని ఒక అగాధం వైపు నడిపిస్తోంది. 'ఉపాధి స్థితిస్థాపకత' మచ్చుకైనా లేని ఈ వృద్ధి నమూనా, కేవలం ధనవంతుల సంపదను పెంచడానికి తప్ప, పేదవాడి కడుపు నింపడానికి పనికిరాదని స్పష్టమవుతోంది.

**మేధస్సుపై సాంకేతిక గొడ్డలిపెట్టు**

సాంకేతిక విప్లవం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వంటి ఆవిష్కరణలు మానవ మేధస్సుకు వరాలుగా ప్రచారం చేయబడుతున్నాయి. కానీ, వాస్తవానికి ఇవి మానవ శ్రమను, మేధస్సును నిలువునా కబళించే రాక్షస శక్తులుగా మారుతున్నాయి. పెట్టుబడిదారులు లాభాల పిచ్చితో మనుషుల కంటే యంత్రాలకే పెద్ద పీట వేస్తున్నారు. యంత్రాలు అలసిపోవు, సెలవులు అడగవు, హక్కుల కోసం పోరాడవు మరియు వీటికి ఎటువంటి భావోద్వేగాలు ఉండవు. పెట్టుబడిదారుల దృష్టిలో ఇది గొప్ప అవకాశంగా కనిపిస్తోంది. కానీ, హెన్రీ ఫోర్డ్ కాలం నాటి దోపిడీ బుద్ధి నేడు ఆధునిక రూపంలో రాజ్యమేలుతోంది. మనిషి కేవలం 'రెండు చేతులు' కాదు, అతనో సంపూర్ణ మానవుడనే నిజాన్ని కార్పొరేట్ సంస్థలు విస్మరిస్తున్నాయి. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ లాభాలు కేవలం 1 శాతం ఉన్న సంపన్నుల జేబుల్లోకి వెళ్తున్నాయి తప్ప, కష్టపడే కార్మికుడికి దక్కాల్సిన కనీస వేతనం కూడా దక్కడం లేదు. ఇది ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటం కాదు, దేశ సంపదను కొద్దిమంది దోచుకోవడం! మెషిన్ లెర్నింగ్ మరియు ఆటోమేషన్ వల్ల ఉత్పాదకత పెరిగినప్పటికీ, ఆ పెరిగిన సంపద ప్రజలందరికీ సమానంగా అందకపోతే, అది దేశ ఆర్థిక వ్యవస్థకు 'వృద్ధి'గా కాకుండా 'విధ్వంసం'గా మారుతుంది.

**కుటుంబ వ్యవస్థపై ఆర్థిక దాడి**

అభివృద్ధి పేరిట మనం చేస్తున్న మరో పెద్ద తప్పు 'సంరక్షణ' (Caregiving) రంగాన్ని విస్మరించడం. మహిళలను ఇంటి పనుల నుండి బయటకు లాగి, గొర్రెల్లా ఫ్యాక్టరీల్లోనో, ఆఫీసుల్లోనో పడేస్తే జిడిపి పెరుగుతుందని సిద్ధాంతాలు రాస్తున్నారు. కానీ, ఆ క్రమంలో ఇంట్లో ఉన్న పసిపిల్లలకు, ముసలివారికి అందాల్సిన సహజసిద్ధమైన మమకారం కరువవుతోంది. ఆ ఖాళీని పూరించడానికి మళ్లీ మార్కెట్‌లోని కృత్రిమ సేవలపై వేల రూపాయలు కుమ్మరించాల్సి వస్తోంది. అంటే, సహజంగా లభించే ఉచిత సంరక్షణను మార్కెట్ వస్తువుగా మార్చడం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న ఈ కాలంలో, వారి సంరక్షణను కూడా ఒక వ్యాపారంగా మార్చాలని చూడటం ఆర్థిక వెర్రితనం తప్ప మరొకటి కాదు. కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ, మనుషులను యంత్రాలుగా మారుస్తూ సాధించే ఈ అభివృద్ధి ఎవరి కోసం? సమాజంలో పెరిగిపోతున్న మానసిక ఒత్తిడి, అభద్రతాభావం వంటివి ఈ తప్పుడు ఆర్థిక విధానాల ఫలితమే.

**అగాధంలోకి భవిష్యత్తు**

నిజమైన అభివృద్ధి అంటే కేవలం అంకెలు పెరగడం కాదు; కుల, మత, వర్గ భేదం లేకుండా ప్రతి పౌరుడికి రాజకీయ, సామాజిక మరియు ఆర్థిక స్వేచ్ఛను అందించడం. కానీ నేడు మనం చూస్తున్నది 'మిస్సింగ్ మిడిల్' సంక్షోభం. చిన్న పరిశ్రమలు చచ్చిపోతున్నాయి, భారీ కార్పొరేట్లు రాజ్యమేలుతున్నాయి. యువతలో నిరుద్యోగం ఒక టైమ్ బాంబులా మారుతోంది. చేతిలో పని లేక, మేధస్సుకు గుర్తింపు లేక యువత మానసిక కుంగుబాటుకు లోనవుతుంటే, మనం మాత్రం 2047 నాటికి 'వికసిత్ భారత్' అవుతామని నినాదాలు చేస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా యువతకు కొత్త నైపుణ్యాలు నేర్పించడంలో విద్యా వ్యవస్థ విఫలమవుతోంది. కేవలం ఒక డిగ్రీ లేదా ఒక నైపుణ్యానికే పరిమితం కాకుండా, 'నిరంతర అభ్యాసం' అలవడేలా విద్యా సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే, మన జనాభా సాంద్రత (Demographic Dividend) మనకే శాపంగా మారుతుంది.

**పరిష్కార మార్గం ఎక్కడ?**

మనం మారాల్సిన సమయం ఆసన్నమైంది. కేవలం స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారుల కోసం కాకుండా, కార్మికులే యజమానులుగా ఉండే సహకార సంస్థలను (Cooperatives) ప్రోత్సహించాలి. ఇది సంపదను సమానంగా పంపిణీ చేస్తుంది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయం, తయారీ రంగాలను అనుసంధానిస్తూ స్థానిక 'ఆర్థిక వెబ్‌లను' సృష్టించాలి. పర్యావరణ సమస్యల వంటి వాటిని ఎదుర్కోవడానికి స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కూడిన పద్ధతులను అనుసరించాలి. అత్యంత సాంకేతిక రంగాలు మినహా, మిగిలిన చోట్ల యంత్రాల కంటే ఎక్కువ మందికి ఉపాధినిచ్చే 'శ్రమ సాంద్రత' కలిగిన పద్ధతులను ప్రోత్సహించాలి. ప్రపంచ దేశాలతో పోటీ పడేలా మన దేశీయ సంస్థలు తమ సామర్థ్యాలను వేగంగా పెంచుకునేలా ప్రభుత్వం మద్దతునివ్వాలి. ఇప్పటికైనా ప్రభుత్వం తన ఆర్థిక కళ్లకు ఉన్న పొరలను తొలగించుకోవాలి. యంత్రాల కంటే మనుషులకు, అంకెల కంటే ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజల కొనుగోలు శక్తిని చంపేసి, కేవలం రోబోలతో ఉత్పత్తి చేస్తే.. ఆ ఉత్పత్తులను కొనే మనుషులు మిగలరనే చేదు నిజాన్ని గుర్తించాలి. మానవత్వాన్ని మంటగలిపే ఏ ఆర్థిక వ్యవస్థ అయినా పేకమేడలా కూలిపోక తప్పదు. 2047 నాటికి భారతదేశం నిజమైన వికసిత్ భారత్‌గా నిలవాలంటే, అది కేవలం ఆర్థిక శక్తిగానే కాకుండా, సామాజికంగా అత్యంత సురక్షితమైన మరియు సమ్మిళిత దేశంగా ఎదగాలి. అప్పుడే మనం కలలుగన్న సమసమాజం సాధ్యమవుతుంది. లేదంటే, ఈ 'అభివృద్ధి' ఒక తరం భవిష్యత్తును బలితీసుకునే సామాజిక వినాశనంగా మిగిలిపోతుంది.







వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 06.03.2026
www.mudranews.in | @mudranews



**వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు**

**వీడియో కాల్స్**



వాట్సాప్ వీడియో కాల్ ఫీచర్ ద్వారా ఎదురె దురుగా మాట్లాడే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ముఖాముఖి సంభాషణకు ఇది చాలా ఉపయోగకరం.

# నరకానికి కేరాఫ్.. ఈ రహదారి

- కూకట్‌పల్లి 'మెయిన్ రోడ్' అస్తవ్యస్తం
- పోలీసుల పోరాటం 'బూడిదలో పోసిన పన్నీరు'
- జీహెచ్ఎంసీ నిద్రమత్తు వదిలేదెప్పుడో?



**ముద్ర కూకట్‌పల్లి:**
హైదరాబాద్‌లోనే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి కేపీహెచ్‌బీ కాలనీ వరకు గల రహదారి ఇప్పుడు వాహనదారులకు ఒక పీడకలగా మారింది. ఐటీ కారిడార్‌కు ప్రవేశ ద్వారంగా ఉన్న ఈ మార్గంలో ప్రయాణం అంటేనే ప్రజలు వణికిపోతున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొన్నా, పట్టించుకోవాల్సిన మున్సిపల్ అధికారులు మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తున్నారు.

**రంగంలో 'ట్రాఫిక్ సైనికులు'.. కానీ తప్పని తిప్పలు**
మండుతున్న ఎండ, ఉక్కిరిబిక్కిరి చేసే దుమ్ము, వాహనాల కాలుష్యం మధ్య నిలబడి కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. నిరంతరం విజిల్ వేస్తూ, చేతులతో సైగలు చేస్తూ వాహనాలను కదిలించడం. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులపై, రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపిన వారిపై ప్రతిరోజు వందల సంఖ్యలో చలాన్లు విధిస్తున్నారు. పోలీసులు తమ వంతుగా 100 శాతం ప్రయత్నిస్తున్నారు. వారు లేకపోతే ఇక్కడ వాహనాలు అంగుళం కూడా కదలవు అని స్థానిక వాహనదారులు పోలీసుల కృషిని కొనియాడుతున్నారు.

**జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం.. వ్యవస్థాగత వైఫల్యమేనా?**
పోలీసులు ఎంత కష్టపడినా అది తాత్కాలిక ఉపశమనమే అవుతోంది. దీనికి ప్రధాన కారణం జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వైఫల్యం అని స్పష్టమవుతోంది. పోలీసులు ఒకవైపు ఆక్రమణలను తొలగిస్తుంటే, వారు వెళ్లగానే వ్యాపారులు మళ్లీ రోడ్లపైకి వస్తున్నారు. వీరిని శాశ్వతంగా నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు.

**కనుమరుగైన ఫుట్‌పాత్‌లు**
పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఇప్పుడు టీ కొట్లు, టిఫిన్ సెంటర్లు, బట్టల దుకాణాలకు అడ్డాలుగా మారాయి. దీంతో జనం రోడ్డు మీద నడవాల్సి వస్తోంది. ట్రాఫిక్ విభాగం, జీహెచ్ఎంసీ మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో పోలీసుల శ్రమ వృథా అవుతోంది.

**గణాంకాలు చెప్తున్న నిజాలు**
రద్దీ సమయం: ఉదయం 9:00 నుంచి– 11:30, అలాగే సాయంత్రం 5:30 – నుంచి 9:30 వరకు పరిస్థితి అత్యంత దారుణమని చెబుతున్నాయి. వై జంక్షన్ నుంచి కేపీహెచ్‌బీకి (సుమారు 3 కి.మీ) ప్రయాణ సమయం సాధారణంగా 10 నిమిషాలు పట్టాలి, కానీ ఇప్పుడు గంటల సమయం పడుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇంజిన్ ఆన్ చేసి ఉండటం వల్ల వాహనదారుల జేబులకు చిల్లు పడటమే కాకుండా పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది.

**ఏసీ గదులకే పరిమితమా?**
"మేము భారీగా ఆస్తి పన్నులు, రోడ్డు పన్నులు కట్టేది ట్రాఫిక్ నరకంలో మగ్గిపోవడానికా?" అని జనం ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారిని ఒక 'సంత'లా మార్చేసినా అధికారులకు పట్టకపోవడం వెనుక లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా? అని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి.



జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా భారీ ఎత్తున శాశ్వత ఆక్రమణల తొలగింపు చేపట్టాలి. వీధి వ్యాపారులకు రోడ్డుపై కాకుండా ప్రత్యామ్నాయంగా సమీపంలో వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయాలి. రోడ్లపైకి సామాన్లు చేర్చి ట్రాఫిక్‌కు అడ్డుగా నిలిచే దుకాణదారుల ట్రేడ్ లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలి. కూకట్‌పల్లి రహదారి సమస్య కేవలం ట్రాఫిక్ సమస్య మాత్రమే కాదు, అది పాలనా యంత్రాంగం యొక్క నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలోకి వచ్చి, పోలీసుల కష్టానికి ఫలితం దక్కేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




**ముద్ర, కాప్రా:**
మహిళలు స్వయం శక్తితో అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా నెహ్రూ నగర్ లో స్నేహ మహిళా మండలి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, ఉపాధి, స్వయం సాధన ద్వారా మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని, కుటుంబం నుండి దేశ స్థాయి వరకు మహిళల నాయకత్వం అవసరమన్నారు. ఆత్మవిశ్వాసం, సంకల్పం ఉంటే మహిళలు ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని అన్నారు. మహిళల సాధికారతే సమాజ పురోగతికి మూలాధారం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మండలి ప్రతినిధులు గొర్ల మధన జగన్, రాములమ్మ, సంతోష, సుజాత, మాజీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భగా పిల్లలు ఎంత మంది ఉన్నారు, శ్యామ్ మ్యామ్ పిల్లలు ఎంత మంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్యామ్ మ్యామ్ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ద్రుష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ–స్కూల్ విద్యా కార్యక్రమాలు, హాజరు నమోదు పుస్తకాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు.కలెక్టర్ పిల్లలతో ముచ్చటించి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలతో పాటు కలెక్టర్ భోజనం చేశారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సప్లిమెంటరీ పోషకాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, పిల్లల ఆరోగ్యం శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రీ–స్కూల్ విద్యా కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిణి కృష్ణ వేణి, సూపర్ వైజర్ జయశ్రీ, నిర్మల, అంగన్వాడి టీచర్ లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలు అమోఘం

- మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘమని మహబూబ్ నగర్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి సంస్థ యొక్క ధర్మమన్నారు. మహబూబ్ నగర్ రెడ్ క్రాస్ సంస్థలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కుమారుడు ఎం. లోకేష్ ముంబాయి లోని ఏసీక్ మెడికల్ కళాశాల లో వైద్య విద్యకు సీటు సాధించారు. సాధారణ కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు కొనసాగించడంలో సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన వెంటనే మహబూబ్ నగర్ శాఖ రెడ్ క్రాస్ విద్యార్థి ని ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. వైద్య విద్య మధ్యలో ఆగిపోకూడదనే లక్ష్యంతో విద్యార్థికి రూ.50 వేల ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆయన తండ్రి రవికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రెడ్ క్రాస్ సంస్థ చేస్తున్న సాయం ప్రశంసనీయమన్నారు. సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవసరమైన వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, డాక్టర్ సామ్యూల్, సంస్థ సభ్యులు, పాల్గొన్నారు.

# కొత్త తరహా చైన్ స్నాచింగ్

## నీళ్లు అడిగి బంగారు గొలుసు కొట్టేసిన వైనం



**ముద్ర, మల్కాజిగిరి**
నగరంలో చైన్ స్నాచింగ్ ఘటనలు రోజు రోజుకీ కొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయి. తాజాగా మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమన్‌పేట్‌లో జరిగిన ఘటన స్థానికులను కలవరపెడుతోంది. న్యూ నల్లకుంటకు చెందిన శ్రీమతి మల్లవజ్జుల పద్మజ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పద్మజ తల్లి మహంకాళి లక్ష్మీకాంతం (85) హనుమన్‌పేట్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఒక పురుషుడు, ఒక మహిళ, ఒక చిన్న పాప కలిసి ఆమె ఇంటికి వచ్చారు. ఇంట్లో ఏదైనా పని ఉందా? ఉంటే ఇక్కడే ఉండి పని చేసుకుంటాం అని వారు అడిగారు. పని లేదని చెప్పడంతో వారిలో మహిళ తమ పాపకు దాహం వేస్తోంది, కొంచెం నీళ్లు ఇవ్వండి అని అడిగింది. దీంతో నీళ్లు ఇవ్వడానికి లక్ష్మీకాంతం ఇంట్లోని ఫ్రిజ్ దగ్గరకు వెళ్లింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన వ్యక్తి ఆమె నోట్లో గుడ్డ పెట్టి అరవకుండా చేసి, ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి కొత్త పద్ధతుల్లో మోసాలు, చైన్ స్నాచింగ్ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో, అపరిచితులను ఇంట్లోకి అనుమతించే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి సిఐ సత్యనారాయణ సూచిస్తున్నారు.

# నేటి నుంచి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

- 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు







**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు వివిధ అంశాలపై 99 రోజుల పాటు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 6 నుండి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ, పట్టణాల్లో ప్రజలకు లబ్ది చేకూర్చిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను అందరినీ భాగస్వాములు చేసి, జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాల్టీలల్లో కార్యక్రమాలను టీమ్ వర్క్ తో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ – అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి ప్రభుత్వ రంగాలకు సంబంధించిన 10 థీమ్ లు ఉంటాయని, ప్రతి థీమ్ కొరకు నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి కార్యక్రమాన్ని డాక్యుమెంటేషన్ చేయాలని, పనిచేయక ముందు, పని చేశాక కార్యక్రమ ఫొటోలు, వీడియోలు తీసుకొని డాక్యుమెంటేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. రోజువారీ కార్యక్రమాలు నివేదిక రూపంలో అందజేయాల్సి ఉంటుందని సూచించారు. మార్చి 6 నుంచి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ అనే థీమ్ ఉంటుందని, మార్చి 6న అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమ ప్రారంభోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి–పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. తమ తమ కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా చేపట్టే ప్రతి పని ప్రజలకు స్పష్టంగా కనిపించాలని కలెక్టర్ చెప్పారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ఎవరైనా అలసత్వానికి తావు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్ మోహన్, సీపీవో సౌమ్య, పీడీ డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, కె.రామవేశ్వరి దేవి, పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

# ఇద్దరు బీఆర్ఎస్ నాయకులపై బహిష్కరణ వేటు

**ముద్ర, నారాయణపేట:**
మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని బీఆర్ఎస్ నాయకులు ఎం.డి. సలీం, జి. వీరారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేయస్సు దృష్ట్యా క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, పార్టీ ఆదర్శాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# ఆస్తి పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యం

**ముద్ర, తాండూర్:** తాండూర్ మున్సిపల్ పరిధిలోని వ్యాపారస్తులు, ఇంటి యజమానులు అందరూ సకాలంలో పన్నులు చెల్లిస్తేనే తాండూర్ పట్టణాన్ని అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చాలావరకు ఆస్తి పన్నులు బకాయిలు ఉన్నాయని ఈ ఆర్థిక సంవత్సరంలో 25 శాతం మాత్రమే పన్నులు వసూలు చేయడం జరిగిందన్నారు. పన్నులు బకాయిలు ఉన్న ఇంటి యజమానులకు, వ్యాపారస్తులకు రెడ్ నోటీసులు అందజేయడం జరిగిందని, నోటీసులకు స్పందించకుంటే వారి ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆస్తి పన్నుల వసూలు కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు కూడా వార్డు వార్డుకు వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారని, పనులు ఎప్పుడు చేస్తున్నారని ముఖ్యంగా తాండూర్ పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

**వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు**

ఫైల్ షేరింగ్




వాట్సాప్ ద్వారా ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు సులభంగా పంపవచ్చు. చదువు, పని విషయాల్లో ఇది సహాయపడుతుంది.

# 'ప్రజా పాలన' విజయవంతం చేయాలి

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**
**- అధికారులతో సమీక్ష**



**ముద్ర, కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై గురువారం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో చేపట్టనున్నఐదు దశల్లో 99 రోజులపాటు ఈ కార్యక్రమ నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సంసిద్ధం కావాలని తెలిపారు. శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించాలని తెలి పారు. ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటా యన్నారు. ఈ సభల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేకూరుస్తున్న లబ్ధి, వివిధ పథకాల గురించి వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రణాళిక శాఖ నోడల్ గా వ్యవహరిస్తుందని తెలి పారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వర కు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాల యాల్లో పెండింగ్ ఫైల్ క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్–అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత– మత్తు పదార్థాల నిర్మూలన, రైతు సంక్షేమం– వ్యవసాయం, విద్య, యువత– క్రీడలు, మహిళలు పర్యావరణం అంశాల్లో నిర్వహించిన కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ ను పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి రాం దత్తారెడ్డి, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ స్పెషల్ అబ్జర్వర్ గా మంత్రి పొన్నం



**ముద్ర, కరీంనగర్:** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఏఐసీసీ స్పెషల్ అబ్జర్వర్ గా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను నియమితులయ్యారు. ఈ మేర కు గురువారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒక ప్రకటన విడుదల చేశారు.

## మాదిగ ఉద్యోగులు వేలాదిగా తరలిరండి..

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిం చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మాన సభకు వివిధ ప్రభుత్వ శాఖల్లోని మాదిగ ఉద్యోగులు వేలాదిగా తరలి రావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో రాష్ట్ర మాదిగ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్మానం నిర్వహిస్తున్నటుల్ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్ర మానికి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## నేడు ఆదిలాబాద్‌లో మంత్రి జూపల్లి పర్యటన



**ముద్ర, ఆదిలాబాద్:** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నెరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా స్పెషలిస్ట్ క్యాంపును ఆయన ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.

**కలెక్టర్లతో సమీక్ష..**

నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ఆయా జిల్లాల ఐడీఓసీల నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ ల ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.


# మౌలిక వసతులు కల్పించాలి

**- కలెక్టర్ అభిలాష అభినవ్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణ వాసులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 38 వ వార్డులో కలెక్టర్ పర్యటించారు. వార్డులోని కేజీబీవీని తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, తాగునీటి వసతి తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో అధికారులతో మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లు దృష్టికి వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. వేసవికాలం ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అవసరమైన చోట డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తూ, అవసరమైన వాటికి మరమ్మతులు చేయాలన్నారు. అంతకు ముందు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులతో కలిసి ఉదయపు అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెస్ నిర్వహణను పరిశీలించి, విద్యార్థులకు వడ్డిస్తున్న అల్పాహారం నాణ్యతను తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ రాజు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యం



**ముద్ర, కరీంనగర్:** ఉద్యోగుల హక్కుల సాధనే తమ లక్ష్యమని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎన్జీవో సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం మెడికల్ అండ్ హెల్త్, పశుసంవర్ధక, జిల్లా ట్రెజరీ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ అండ్ హెల్త్ శాఖ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యూనియన్ నాయకులు గోవిందపతి శ్రీనివాస్, జీవన్ రెడ్డి, పాండు, ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధనలో తెలంగాణ ఎన్జీవో సంఘం ఎప్పుడూ ముందుండి పోరాటం చేస్తోందన్నారు. మెడికల్ అండ్ హెల్త్ శాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీతనంతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు నోరులేని మూగజీవాలకు సేవ చేస్తూ సమాజానికి కీలక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గిరిధర్ రావు, కమలాకర్, అభిషేక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

జిల్లా ట్రెజరీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ నల్ల లింగారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీఎన్జీవోల జిల్లా నాయకులు సంగ్యం లక్ష్మణ రావు, ముప్పిడి కిరణ్ కుమార్, సర్దార్ అరవింద్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వరరావు, అలాగే ఉద్యోగులు రాజేష్, హైమావతి, హరిప్రియ, జగన్ గౌడ్, విజయలక్ష్మి, తోట రాజు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో మందుల కొరత ఉండొద్దు



**ముద్ర, కరీంనగర్:** ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. గురువారం జిల్లాలోని సుల్తానాబాద్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేశారు. ఓపి సేవలను పరిశీలించారు. డెంటల్ ఓపికు వస్తున్న కేసులు, అందిస్తున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు చేయాలని ఆదేశించారు. మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి ఆర్ఎంఓ, సిబ్బంది ఉన్నారు.

## వివాహ వేడుకలకు హాజరైన మంత్రి



**ముద్ర, హైదరాబాద్:** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పాల్గొన్నారు. గురువారం హైదరాబాద్ లో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## రేపు వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో శనివారం వికసిత్ భారత్ కనెక్ట్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేశ్ కుమార్ సింగ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్ర మంలో భాగంగా వశిష్ట డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ కనెక్ట్ జిల్లా స్థాయి సెలెక్షన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు. 50 ఏళ్ల ఎమర్జెన్సీ: భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు అనే అంశంపై చర్చ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలకు కళాశాల జాతీయ సేవా కార్యక్రమ సమన్వయకర్త రవి ని 9912039609 నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

## బాసర విద్యార్థులకు సీమెన్స్ స్కాలర్ షిప్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** అంతర్జాతీయ సంస్థ సిమెన్స్ ఇండియా నిర్వహించే ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్ నకు బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ స్కాలర్ షిప్ యువ ఇంజనీర్ల వృత్తిపర అభివృద్ధికి తోడ్పడు తుంది. ప్రతిభావంతులైన యువ ఇంజినీర్లను ప్రోత్సహించడం, వారిని భవిష్యత్ సాంకేతిక నాయకులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ స్కాలర్‌షిప్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు, నిపుణులైన మెంటర్‌షిప్, ఆధునిక టెక్నికల్ ట్రైనింగ్, ప్రముఖ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయి. ఇది వారి కెరీర్ వృద్ధికి కీలకమని భావిస్తున్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డి ప్రొఫెసర్ మురళీ దర్శన్ అభినందించారు. ఈ అవకాశం వారి భవిష్యత్తుకు, దేశ సాంకేతిక పురోగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో సహకరించిన యూనివర్సిటీ యాజమాన్యానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలి



**మహాదేవపూర్, ముద్ర:** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తన లక్ష్యమని మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బాను అన్నారు. గురువారం గ్రామంలోని 8వ వార్డులో రోడ్డుకు ఇరువైపుల ఉన్న వ్యర్థాలు, పిచ్చి మొక్కలను సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ సంద ర్భంగా వార్డులోని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, చీర్లవంచ చంద్రశేఖర్, మహ్మద్ బిన్ అలీ, నల్ల బుగ్గ సమ్మయ్య, నయుముద్దీన్, కొండపల్లి రాములు, సిబ్బంది పాల్గొన్నారు.


## బీడీ కార్మికుల పింఛన్ పెంచాలి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఆన్ లైన్ విధానాన్ని ప్రారంభించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు ₹4016 పింఛన్ ను తక్షణం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన అనంతరం కార్యాలయంలో వినతి పతం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నేటి పరిస్థితుల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ సూచించారు. జిల్లాలోని సారంగాపూర్ మండలం చించోలి–బి మహిళా ప్రాంగణంలో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ప్రాంగణం అధికారి విజయలక్ష్మి హాజరై పథకాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈడీసీ మేనేజర్ అభినయ్ దీప్, అసిస్టెంట్ మేనేజర్ తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు




**మహదేవపూర్, ముద్ర:** విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీఓ హరికృష్ణ, పరీక్షల విభాగం చీఫ్ సూప రెంటెండెంట్ సదానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మంచి ఫలితాలు సాధించాలి..**

ని బాగా చదివి ఉత్తమ ఫలి తాలు సాదించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం జంగేడు కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ హరికృష్ణ, డీఈఓ రాజేందర్, ఎస్ఓ ఈశ్వరి తదితరులు ఉన్నారు.

వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు
స్టేటస్ ఫీచర్
వాట్సాప్ స్టేటస్‌లో ఫోటోలు, వీడియోలు లేదా టెక్స్ట్‌ను 24 గంటల పాటు షేర్ చేయవచ్చు. ఇది సోషల్ మీడియా స్టోరీల మాదిరిగా పనిచేస్తుంది.






## బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లి కానుక అందజేత

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో పలువురు ఆడబిడ్డల పెళ్లిళ్లకు వివాహ కానుకలను అందజేశారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన గర్దాసు రమ్య - క్రాంతికుమార్ దంపతుల కూతురు వివాహానికి వివాహ కానుకను అందజేశారు. యాదగిరిగుట్ట మండలం మాసాయి పేట గ్రామానికి చెందిన ఆలకుంట్ల లక్ష్మి - యాదగిరి దంపతుల కూతురు వివాహానికి వివాహ కానుకను అందజేశారు. మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన వంగా లలిత - రమేష్ దంపతుల కూతురు వివాహానికి వివాహ కానుకను అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అనిత మాట్లాడుతూ, బీర్ల ఫౌండేషన్ ద్వారా అవసరమైన కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని తెలిపారు.

# ఏకాగ్రతతో చదవాలి

- వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ముద్ర, ఖమ్మం:**



ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కావాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులకు సూచించారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్ రోడ్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికల)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, కోడిగుడ్లు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి రికార్డులెక్కలను క్షుణంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూకు అనుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పదో తరగతి గదిని సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధపడాలని అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు నిద్రలేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దని, ప్రతి రోజు కనీసం 7 నుంచి 8 గంటల పాటు మంచి నిద్ర ఉండాలని తెలిపారు. మంచినీరు తగినంత తాగాలని, ఆరోగ్యంగా ఉంటే చదువు మీద దృష్టి పెడుతామని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీవో జ్యోతి, ప్రిన్సిపాల్ కె. శ్రీ లత, వైస్ ప్రిన్సిపాల్ డి. సంధ్యారాణి, ఉపాధ్యాయులు సిహెచ్. ఎల్లిశ్వరి, జి. సంధ్యారాణి, కె. విజయలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ

**ముద్ర మోత్కూరు:**

ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, మౌలిక సదుపాయాలను అంచనా వేయడానికి గురువారం మోత్కూరు మండల వనరుల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను మండల విద్యా శాఖ అధికారి సత్యనారాయణ సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ టి రవి కిరణ్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు పాఠశాలల పనితీరుపై ప్యానల్ ఇన్స్ పెక్షన్ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, క్రీడలు, లైబ్రరీ నిర్వహణ, ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్, ఎఫ్ ఎల్ ఎన్, ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు వనం వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, పాఠశాల ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి ఉపాధ్యాయులు లలిత , సౌజన్య, రాములు,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# వస్తువును పరిశీలించి కొనాలి

- వినియోగ దారుల హక్కుల పై అవగాహన సదస్సు

**ముద్ర మోత్కూరు:**



ప్రపంచ వినియోగదారుల హక్కుల దిన వారోత్సవాల సందర్భంగా గురువారం మోత్కూరులోని మండల మహిళ సమైక్య భవనంలో జరుగుతున్న స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రైమర్ మహిళల సమావేశంలో వినియోగదారుల హక్కులు బాధ్యతలపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాక్టో) రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పిస్తూ ప్రతి వినియోగదారుడు వస్తువు కొనేముందు వస్తువుపై ముద్రించిన సమాచారం పూర్తిగా చదివి రషీద్ పొందాలన్నారు. వస్తువు కొనేటప్పుడు బరువు ఎంఆర్పి రేటు సరి చూసుకోవాలని వస్తూ నాణ్యత పరిశీలించుకోవాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువులు కొనేటప్పుడు వారంటీ గ్యారెంటీ కార్డులు బిల్లుతోపాటు పొందాలని సూచించారు. ఒకవేళ వస్తువు నాణ్యత లేక చెడిపోయి నష్టపోతే వినియోగదారుడు కన్స్యూమర్ కోర్టుకు ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. తూనికల కొలతల్లో తేడాలు ఆహార పదార్థాలు నాణ్యత లోపించిన సేవా లోపాలు జరిగిన ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారుల నిర్లక్ష్యంపై ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు ఫక్కిరు, కేపీ రాజు, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు శైలజ, కోఆర్డినేటర్ లోడే భాస్కర్ వినియోగదారుల మండల ప్రతినిధి పల్లపు సాయి తదితరులు పాల్గొన్నారు.



## 'భట్టీ' కుమారుని వివాహానికి హాజరైన చైర్మన్ శ్రీవాణి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. చైర్మన్ వెంట భువనగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం, కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్ కుమార్, మండల నాయకులు రమేష్ ఉన్నారు.

## రేషన్ డీలర్ పై క్రిమినల్ కేసు

**ముద్ర, ఖమ్మం:**

చింతకాని మండలం నాగలికొండ గ్రామంలో రేషన్ డీలర్ పై సివిల్ సప్లై అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. గురువారం నాగలికొండలో రేషన్ షాపును సివిల్ సప్లై అధికారులు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 112.61 క్వింటాళ్ల సరుకు గాను కేవలం 52.50 క్వింటాళ్ల సరుకు మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనగా 60.11 క్వింటాళ్ల సరుకు తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. ఇది పేదల హక్కులను హరించే తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ 6 ఏ , క్రిమినల్ కేసు నమోదు చేశారు. జిల్లాలోని రేషన్ డీలర్లు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని , నిల్వలలో తేడా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రేషన్ లలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని , నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి వయసులు బాటులు ఇవ్వమని స్పష్టం చేశారు.



## 99 రోజుల ప్రణాళికపై సమీక్ష

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల ప్రణాళికపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 6 నుండి 15 వరకు పర్యావరణ పరిశుభ్రత, ఫైల్స్ క్లియరెన్స్ పై నిర్వహించబోతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేయవలసిన పనుల గురించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ శ్రీమతి పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం వివిధ శాఖ అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.





## స్వర్ణ గిరీషుడికి తిరుప్పావడ సేవ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రాతఃకాలంలో సుప్రభాత సేవతో ఆలయంలో నిత్య కైంకర్యాలు జరిగాయి. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం. స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేశారు. సాయంత్రం ఆదిమధ్యాంతర హితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామి వారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.



## తిమ్మాపురం సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ ను కోరిన సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

భువనగిరి మండలంలోని బిఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ అనురాగ్ జయంతిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచ్ కలెక్టర్ కు బస్వపూర్ రిజర్వాయర్ లో మా బిఎన్ తిమ్మాపురం గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతున్నదని, కొన్ని సంవత్సరాలుగా గ్రామ నష్టపరిహారాల కోసం పోరాడుతున్నామని గ్రామంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇండ్ల నష్టపరిహారం, పట్టా కబ్జా భూముల నష్టపరిహారాన్ని ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా ఇప్పించే విదంగా కృషి చేయాలన్నారు. నూతన గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సర్పంచ్ గారితో మాట్లాడుతూ అతి త్వరలో మీ నూతన గ్రామాన్ని సందర్శించి మీకు రావాల్సిన నష్టపరిహాలపై ప్రభుత్వంతో మాట్లాడి, ముంపు గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సమి ఉద్దీన్, మోర నర్సి రెడ్డి, కౌన్సిలర్ తహెరా మజర్ పాషా బబ్లు, మాజీ వార్డు సభ్యులు దొంకేన అశోక్ గౌడ్, వళ్ళందస్ పరమేష్ కుమార్ పాల్గొన్నారు.

## జీనియస్ విద్యార్థుల ప్రతిభ

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

2025 నవంబర్ 12న అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో పట్టణంలోని జీనియస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 323 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది బంగారు పతకాలు సాధించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి సూర్యనారాయణ రెడ్డి, డైరెక్టర్ తోట శ్రీధర్ విద్యార్థులకు ఆయా పతకాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి స్వర్ణలత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# యశోదలో అరుదైన శస్త్రచికిత్స

- డాక్టర్ విక్రమ్ భైరి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**




సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్,రోబోటిక్ జాయింట్ నీ రీప్లేస్మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ విక్రమ్ భైరి ఆధ్వర్యంలో అరుదైన రోబోటిక్ మోకాలి మార్పిడి (రోబోటిక్ జాయింట్ నీ రీ ప్లేస్ మెంట్) శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక బైపాస్ రోడ్డు పక్కన ఉన్న సంకల్ప్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ విక్రమ్ భైరి మాట్లాడుతూ మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 78 ఏళ్ల రాజ్యలక్ష్మి అనే మహిళకు రోబోటిక్ జాయింట్ నీ రీ ప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స చేసిన సాయంత్రానికే ఆమె ఆరోగ్యంగా నడుచుకుంటూ వెళ్లినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్స జరిగి ఇప్పటికి ఐదు నెలలు పూర్తయ్యాయని, ఈ కాలంలో ఆమెకు ఎలాంటి కాళ్ల, కీళ్ల నొప్పులు లేకుండా మునుపటికంటే మెరుగ్గా నడవగలుగుతున్నారని వెల్లడించారు. తన వద్దకు వచ్చే రోగులకు మోకాళ్ల నొప్పులకు సంబంధించి శాతానికి శాతం ఉపశమనం కలిగేలా చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. శాస్త్రచికిత్స అనంతరం ఫిజియోథెరపీ చేయించుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. శస్త్రచికిత్స చేయించుకున్న రాజలక్ష్మి మాట్లాడుతూ మోకాళ్ల నొప్పుల కారణంగా నడవడం కూడా కష్టంగా ఉండేదని, ప్రతి అడుగులోనూ తీవ్రమైన నొప్పి అనుభవించాల్సి వచ్చేదని చెప్పారు. శస్త్రచికిత్స చేయించుకున్నామని తెలిపారు. డాక్టర్ విక్రమ్ భైరి ఆధ్వర్యంలో వైద్యులు కన్నకొడుకులా చూసుకుని శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ఆస్పత్రి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి, వెంకట్ సీనియర్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ రవితేజ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 06-03-2026
www.mudranews.in | @mudranews



### వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు

**ఫైల్ షేరింగ్**

వాట్సాప్ ద్వారా ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు సులభంగా పంపవచ్చు. చదువు, పని విషయాల్లో ఇది చాలా సహాయ పడుతుంది.



‘ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక’ను

## అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలి

**ముద్ర, నిజామాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం ‘ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక’ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలని నిజామాబాద్ డీఎస్సీడీఓ, మండల ప్రత్యేక అధికారి రాజాగంగారం సూచించారు. గురువారం జిల్లాలోని కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల శుభ్రత, రికార్డుల సక్రమ నిర్వహణ, పెండింగ్లో ఉన్న ఫైళ్ల పరిష్కారం, ప్రజా వినతుల పై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీలు, బస్టాండ్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రైనేజీల పూడికతీత, బ్లీచింగ్ సున్నం చల్లడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అందు కోసం ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో పెట్టాలని ఆదేశించారు. రాబోయే వేసవి కాలంలో చేపట్టే చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, ఎంపీఓ సదాశివ, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



## దీర్ఘకాలిక రుణాలను రైతులు చెల్లించాలి

**- ఎన్డీసీసీబీ జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి**

**ముద్ర, కామారెడ్డి:**

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎన్డీసీసీబీ ద్వారా రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను చెల్లించాలని ఉమ్మడి జిల్లాల ఎన్డీసీసీబీ జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మండలంలోని పోల్కంపేట్, షేట్పల్లి సంగారెడ్డి, సజ్జనపల్లి, ముంబాజిపేట్, భవానీపేట గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. రుణాలను త్వరగా చెల్లించాలని సూచించారు. దీర్ఘకాలిక రుణాలకు వన్ టైం సెటిల్మెంట్ పద్ధతిని ఉపయోగించుకోవాలన్నారు. మండలంలోని మూడు సొసైటీల పరిధిలో రూ.8కోట్ల రుణాలు బకాయి ఉన్నట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా రుణాలు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎన్డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ గజానంద్, లింగంపేట ఎన్డీసీసీబీ మేనేజర్ రంజిత్ కుమార్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాకేష్, సిబ్బంది దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను వేగంగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**ముద్ర, కామారెడ్డి:**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను, ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఆర్డీవో వీణ, తహసీల్దార్ ఉమాలత, ఎంఈవో ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ లో

## 11 మంది అరెస్ట్.. ఇద్దరికి జైలుశిక్ష

**ముద్ర, నిజామాబాద్:**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేసి గురువారం ఆర్మూర్లోని కోర్టులో హాజరు పరిచినట్లు ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఆర్మూర్లోని కోర్టులో డ్రంక్ అండ్ డ్రైవ్లో దొరికిన వారిని హాజరుపరచగా 9 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం 90 వేల రూపాయల జరిమానా, ఇద్దరికీ ఐదు (5) రోజుల సాధారణ జైలు శిక్షను ఆర్మూర్ కోర్టు న్యాయమూర్తి జెఎఫ్సీఎం భవ్య శ్రీ విధించినట్లు తెలిపారు. వాహనదారులు తమ వాహనాలను మద్యం సేవించి నడపరాదని, మోటార్ వెహికల్స్ నూతన చట్టం ప్రకారం భారీగా జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే వాహనదారులు తమ వాహనాల ధ్రువపత్రాలను ఎల్లప్పుడూ తమ దగ్గర ఉంచుకోవాలని ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ సూచించారు.

### ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# పకడ్బందీగా నిర్వహించాలి

**- కలెక్టర్ ప్రతిమాసింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలు కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, హోం, రవాణా, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు.

ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి, పొడి చెత్త సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం – ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని వివరించారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం హోం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని అన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత, రక్షణ – డ్రగ్స్కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుండి మే 9 వరకు రైతులు, వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు–విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు. మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్పీ డివి శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా దినోత్సవం కోసం అనేక పోరాటాలు

**- మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




18వ శతాబ్దం నుండి మహిళల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తేనే మహిళా దినోత్సవం అమల్లోకి వచ్చిందని మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మెదక్ కేవల్ కిషన్ భవనంలో 115వ మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెరికాలోని న్యూయార్క్ సోషలిస్ట్ అమెరికాలో మహిళా దినోత్సవం జరిగిందన్నారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవిత మాట్లాడుతూ మహిళా తన కుటుంబం కోసం, సమాజం కోసం సమానంగా కష్టపడి పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ, జిల్లా కన్వీనర్ నాగమణి, జిల్లా నాయకులు కవిత వైశాఖ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




న్యాయవాది సతీష్ పై పాపన్నపేట ఎస్ఐ చేయి చేసుకోవడాన్ని ఖండిస్తూ గురువారం మెదక్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కోర్టు ప్రధాన గేటు వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మర్కంటి రాములు మాట్లాడుతూ తనకు జరిగిన రోడ్డు ప్రమాదంపైన కేసు పెట్టేందుకు వెళ్ళిన తమ సహచర న్యాయవాదిని దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడి చేసినటువంటి ఎస్సైపై ఎన్ఐఆర్ నమోదయ్యేంత వరకు విధులను బహిష్కరించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జనార్ధన్ రెడ్డి, ఫజల్ అలీ, జీవన్ రావు, రవీందర్, వెంకటేశం, రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మస్కట్లో రోడ్డు ప్రమాదం..
## ఆలూరు వాసి మృతి

**ముద్ర, నిజామాబాద్:**

మస్కట్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రానికి చెందిన ఆంద్రాసి మల్లయ్య (45) మృతి చెందారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఆయన మంగళవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మల్లయ్య కుటుంబ పోషణ కోసం కొన్నేళ్లుగా మస్కట్లో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. అకాల మరణంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామమైన ఆలూర్కు త్వరగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

## ‘ఉపాధి’ పనులను పరిశీలించిన ఎంపీడీవో

**ముద్ర, నిజామాబాద్:**

రాజంపేట్ మండల పరిధిలోని నడిమి తండా, సిద్ధాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో బాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, కూలీల సంఖ్య పెంచాలని, ప్రతి కూలి సరైన కొలత ప్రకారం పనిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనుల నాణ్యతను, మాస్టర్ రోల్స్ ను పరిశీలించారు. కూలీలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా, కొలతల ప్రకారం పనిచేయాలని, దాని ప్రకారమే వేతనాల చెల్లింపు జరుగుతుందని తెలిపారు. పనుల్లో జాగ్రత్త వహించి ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శృతి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



## సౌర విద్యుత్ తో ఖర్చు తగ్గించుకోవాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:**

సౌర విద్యుత్ తో చార్జీలు తగ్గించుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పిఎం సూర్యఘర్ ప్రచార వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఈ వాహనం మెదక్ జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో పర్యటించి ఈ పథకం గురించి అవగాహన కల్పించి ప్రయోజనాలను వివరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేకల మందపై చిరుత పులి దాడి

**ముద్ర, నిజామాబాద్:**


జిల్లాలోని వర్ని మండలం, కూనిపూర్ అటవీ ప్రాంతంలో మేకల మందపై చిరుత పులి దాడి చేసింది. కునిపూరు గ్రామానికి చెందిన కుక్కలి సాయిలు అనే వ్యక్తికి చెందిన మేకల మందను అటవీ ప్రాంతంలోకి మేత కొరకు తీసుకు వెళ్లగా అకస్మాత్తుగా చిరుత పులి మందపై దాడి చేసింది. భయాందోళనకు గురైన మేకల కాపరి అనిల్ గ్రామంలోకి పరిగెత్తుకుంటూ వెళ్లి గ్రామస్తులకు తెలిపాడు. గ్రామస్తులు వెళ్లి ఒక మేకను చిరుత పులి చంపినట్లు గుర్తించారు. మేకల కాపరి అనిల్ మాట్లాడుతూ ఇదివరకు కూడా మేకల మందపై చిరుత దాడి చేసిందని, అటవీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



## వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు

### వాయిస్ మెసేజెస్

టైప్ చేయకుండా వాయిస్ రికార్డ్ చేసి మెసేజ్ పంపే అవకాశం ఉంది. త్వరగా సమాచారం చెప్పాలనుకుంటే ఇది చాలా సౌకర్యంగా ఉంటుంది.





# హాకీ టోర్నమెంట్ కు రావాలని సీఎంకు ఆహ్వానం

**ముద్ర, హైదరాబాద్:**

హైదరాబాద్ లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఈ నెల 8 నుంచి 14 వరకు జరగనున్న ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫై ఉమెన్ టోర్నమెంట్ కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి ని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ డాక్టర్ సోనీ బాలా దేవి కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.







# అంతర్జాతీయ పర్యావరణహిత నగరంగా హైదరాబాద్

- క్యూర్.. ప్యూర్.. రేర్ విభజనతో అభివృద్ధికి ప్రణాళికలు
- క్యూర్- ప్యూర్ రీజియన్ల మధ్యలో హరిత జోన్లు
- 1.10లక్షల ఎకరాల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్
- ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షా లు కురిసేలా చర్యలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దడంతో పాటు... నగరం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. క్యూర్ ప్యూర్ రీజియన్ల మధ్యలో హరిత జోన్లు (గ్రీన్‌బెల్ట్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే 1.10లక్షల ఎకరాల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ తదితర వ్యాపారాలు చేసుకునేలా వసతులు సమకూర్చనుంది. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో లేదా.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా లేదా గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు. ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ తో ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య 110 ప్రాంతాలను హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్ జోన్లుగా విభజించనున్నారు. ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దీంతో దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది. ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి. మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

# రాత్రివేళల్లో భద్రతా కవచం ఫుట్ పెట్రోలింగ్

- సైబరాబాద్ పోలీసుల ప్రత్యేక కార్యాచరణ
- ప్రజల వద్దకే పోలీసులు

**ముద్ర, శేరిలింగంపల్లి:**

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేసే దిశగా వినూత్న కార్యాచరణ చేపట్టారు. కేవలం పెట్రోలింగ్ వాహనాల గస్తీకే పరిమితం కాకుండా, ప్రజల మధ్యకు నేరుగా నడుచుకుంటూ వెళ్తూ 'మేమున్నం' అనే భరోసా కల్పించే విధంగా ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ప్యాట్రోల్ కార్లు, బ్లూ కోల్ట్ సిబ్బంది తమ వాహనాలను నిలిపివేసి, నిత్యం ప్రజలతో మమేకమవుతూ జనసంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్‌లు, నివాస కాలనీలు, చిన్న చిన్న వీధుల్లో పోలీసులు కాలినడకన పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో స్థానికులతో నేరుగా సంభాషించడం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ, నేర నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా ఈ ఫుట్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



**ఫుట్ ప్యాట్రోలింగ్ ప్రయోజనాలు..**

క్షేత్రస్థాయి పర్యవేక్షణ: బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది వాహనాలను పక్కన పెట్టి, మార్కెట్లు, బస్టాండ్‌లు , నివాస ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తున్నారు.

నేరాల కట్టడి: వాహనాలు వెళ్లలేని ఇరుకైన సందుల్లో కూడా పోలీసులు తిరగడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడుతోంది.

ప్రజలతో మమేకం: రాత్రి వేళల్లో పనిచేసే కార్మికులు, వ్యాపారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

అప్రమత్తత : అనుమానాస్పద కదలికలు ఉంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనుమానితుల వివరాలను సేకరిస్తున్నారు.

శారీరక చురుకుదనం: నిరంతరం నడవడం వల్ల పోలీసు సిబ్బందిలో శారీరక దారుఢ్యం పెరుగుతుంది.

ప్రజల్లో విశ్వాసం: ప్రజల మధ్య ఉండటం వల్ల పోలీసులపై ప్రజల్లో భరోసా భావం పెరుగుతుంది.

ముందస్తు సమాచారం : స్థానికులతో స్నేహపూర్వకంగా ఉండడం వల్ల ఒక్కోసారి నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం తెలుసుకునే వీలుంది.

**అప్రమత్తత పెరిగింది**

ఇలా రోజుకు కొన్ని కిలోమీటర్లు నడవడం వల్ల రాత్రిపూట వచ్చే నిద్రమత్తు వదిలిపోయి, అప్రమత్తత పెరిగింది.

**– ఎస్. రాజు, పోలీస్ కానిస్టేబుల్**



**సరికొత్త ఒరవడి**

మీ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెనుకాడకుండా పోలీసులకు సమాచారం అందించండి. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయాల్లో పోలీసులు నిర్వహిస్తున్న ఈ ఫుట్ పెట్రోలింగ్ సరికొత్త ఒరవడిని సృష్టించింది. నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయడం, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడం కోసం ఇది నిరంతరం కొనసాగిస్తాం.

**– పి. సతీష్, దుండిగల్ ఇన్‌స్పెక్టర్**

**నిరంతరం నిఘా**

ఫుట్ పెట్రోలింగ్ వల్ల వాహనాలు వెళ్లలేని సందుల మధ్యలోకి కూడా వెళ్లగలుగుతున్నాం. వాహనాల్లో తిరిగే గస్తీతో పోలిస్తే కాలినడక గస్తీ ద్వారా అనుమానాస్పద కదలికలను త్వరగా గుర్తించగలుగుతున్నాం.

**– కె. సాయి కుమార్, పోలీస్ కానిస్టేబుల్**



**ప్రజలతో మమేకం**

మేము నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు ప్రజలు మాతో చొరవగా మాట్లాడుతున్నారు. టీ దుకాణాలు, రాత్రి కాపలాదారుల వద్ద ఆగి మాట్లాడటం వల్ల వారి సమస్యలు మా దృష్టికి వస్తున్నాయి.

**– వై. చిరంజీవి, పోలీస్ కానిస్టేబుల్**



**ఎంతో సంతృప్తి..**

కేవలం నేరగాళ్లను పట్టుకోవడమే కాకుండా, సామాన్య ప్రజలకు రక్షణగా నిలుస్తున్నామనే భావన వృత్తిపరమైన సంతృప్తినిస్తుంది. ప్రజల మధ్య తిరగడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇస్తున్నారు. ఇది నేరాలు నివారణకు ప్రివెంటివ్ పోలీసింగ్ కు ఉపకరిస్తుంది.

**– రామ్మోహన్, దుండిగల్ ఎస్సై**

# సర్కారు జనం బాట


- మూడోసారి జనంలోకి ప్రజా ప్రభుత్వం
- విడతలు వారీగా కార్యక్రమాలు

**ముద్ర. తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం మూడోసారి ప్రజల్లోకి వెళ్లుతోంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2023 డిసెంబర్ లో 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన గ్రామ, వార్డు సభలను నిర్వహించింది. 2025 జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు రెండోసారి ప్రజా పాలన గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించింది. ఇప్పటికే రెండుసార్లు ప్రభుత్వం ప్రజా పాలన గ్రామసభలు, వార్డు సభలతో నేరుగా ప్రజల వద్దకు చేరుకుంది. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి నుంచి అర్జీలు స్వీకరించటంతో పాటు ప్రజలతో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. రెండు విడతల్లోనూ ప్రజల సమక్షంలో వచ్చిన అర్జీలతోనే ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసింది. అక్కడ తీసుకున్న అర్జీల ఆధారంగానే రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ. సన్న బియ్యం పంపిణీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ పథకాలను అమలు చేసింది.

**మూడోసారి ప్రజా బాట..**

ఇప్పుడు మూడోసారి 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణకు నడుం బిగించింది. పౌర సేవలు, ప్రజల అవసరాలతో మమేకమై ఉండే అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక కార్యక్రమాలు తలపెట్టింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు స్థాయిల్లో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతోంది. ఈ నెల 6 నుంచి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్యంతో పాటు పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయనుంది. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముందస్తు ఉత్సవంగా ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులను ఇందులో భాగస్వాములను చేసింది. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణతో పాటు మండల కేంద్రాలు, పట్టణ కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో సరికొత్త కార్యాచరణకు నడుం బిగించింది. మండలాలు, జిల్లా కేంద్రాల్లో వివిధ శాఖల అధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనుంది. అన్ని స్థాయిల్లోనూ గ్రామ సర్పంచి నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీల వరకు ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసేలా మార్గదర్శకాలను రూపొందించింది. రెండేండ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, వాటితో లబ్ది పొందిన కుటుంబాలు, లబ్ధి పొందిన వర్గాలకు చేసిన మేలును క్షేత్ర స్థాయిలో చెప్పుకోవటంతో పాటు.. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు తప్పకుండా అందించాలనే సంకల్పంతో ఈ సభలను ఏర్పాటు చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో వస్తున్న సంస్కరణలు, వైద్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ హాస్పిటళ్లను తీర్చిదిద్దే ప్రణాళికను ప్రజలకు వివరించనుంది. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించే 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను గుర్తించి, పిల్లల తల్లితండ్రుల్లో అవగాహన పెంచనుంది. విద్యుత్తు డిమాండ్ కు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్తు, ప్రధానంగా సోలార్ విద్యుత్ వినియోగం పెంచటం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలను ప్రజలకు, రైతులకు తెలియజేయాలనేది లక్ష్యంగా ఎంచుకుంది. ఖాళీ స్థలముండి ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలనే ప్రజా ప్రభుత్వ లక్ష్యాన్ని నూటికి నూరు పాళ్లు అమలయ్యేలా చూడాలని సంకల్పించింది. పదేండ్లుగా ఇవ్వని రేషన్ కార్డులను.. అర్హులైన వారందరికీ ఇవ్వాలని, ఇదో నిరంతర ప్రక్రియగా అమలు చేయాలని నిర్ణయించింది. యువతకు నైపుణ్యాల శిక్షణతో పాటు ఉపాధి కల్పించే కార్యక్రమాలు 99 రోజుల యాక్షన్ ప్లాన్లో చేపట్టనుంది. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో జాబ్ మేళాలు నిర్వహించి.. లక్ష మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనేది టార్గెట్ గా ఎంచుకుంది. ఇందిరా మహిళా శక్తి సాధిస్తున్న విజయాలను, కొత్తగా వ్యాపారాభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించనుంది. అన్ని జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను ప్రారంభించనుంది.



**షెడ్యూల్ ఇది..**

- 1వ వారం – గ్రామీణ అభివృద్ధి(మార్చి 30 నుంచి ఏప్రిల్ 4 )
- 2వ వారం – ఆరోగ్య రంగం(ఏప్రిల్ 6 నుంచి ఏ 11)
- 3వ వారం – అరైవ్ - అలైవ్ ( ఏప్రిల్13 నుంచి 18)
- 4వ వారం – సంక్షేమం (ఏప్రిల్ 20 నుంచి 25 వరకు)
- 5వ వారం – పిల్లల భద్రత, డ్రగ్స్ అడ్డుకట్ట (ఏప్రిల్ 27 నుంచి మే2)
- 6వ వారం – రైతు సంక్షేమం (మే 4 నుంచి 9 వరకు)
- 7వ వారం – విద్య (మే 11 నుంచి 16 వరకు)
- 8వ వారం – యువత, క్రీడలు (మే 18 నుంచి 23 వరకు)
- 9వ వారం – మహిళా సంక్షేమం( మే 25 నుంచి 30 )
- 10వ వారం – పర్యావరణం( జూన్1 నుంచి 6 వరకు)

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు**

లైవ్ లోకేషన్ షేర్ తన ప్రస్తుత లోకేషన్‌ను ఇతరులతో షేర్ చేయవచ్చు. ప్రయాణంలో ఉన్నప్పుడు లేదా ఎవరికైనా మార్గం చెప్పాల్సినప్పుడు ఇది ఉపయోగపడుతుంది.

# లొంగుబాటులో దళపతి ‘గణపతి’

- **లొంగుబాటలో మావోయిస్టు సిద్ధాంతకర్త గణపతి**
- **అడవి వీడిన 'టీచర్': ఢిల్లీలో ఎస్ఐబీ అదుపులో ముప్పాళ్ల లక్ష్మణరావు.**

**ముద్ర డెస్క్ :**



మావోయిస్టు సిద్ధాంత కర్త గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు లొంగుబాటుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. నేపాల్‌లో ఆయనను అదుపులోకి తీసుకొని, ప్రస్తుతం ఢిల్లీలో ఒక రహస్య స్థావరంలో ఆయనను తెలంగాణ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పెట్టినట్లు సమచారం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర డీజీపీ శివాధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి హుటాహుటిన ఢిల్లీకి వెళ్లడానికి కారణం కూడా ఇందుకే అని అనుకుంటున్నారు. అమితా షా, రేవంత్ రెడ్డి సమక్షంలో గణపతి లొంగిపోయేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ఇంటలిజెన్స్ వర్గాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో గణపతి వీరికి టచ్‌లో వచ్చారని, వెంటనే నేపాల్‌కు ప్రత్యేక బృందం వెళ్లి ఆయనను సురక్షితంగా ఢిల్లికి తీసుకువచ్చినట్లు తెలిసింది. గణపతితో పాటు మరికొందరి నేపాల్‌కు వచ్చిన వారి వివరాలు కూడా సేకరించినట్లు తెలిసింది. కొద్ది రోజుల ముందు లొంగిపోయిన అగ్రనేతల ఇచ్చిన సమాచారం మేరకు గణపతి నేపాల్‌లో ఉండవచ్చని తెలుసుకున్నారు.

**నడవలేని స్థితిలో గణపతి..**

అనారోగ్యంతో నడవలేని, గుర్తుపట్టలేని పరిస్థితుల్లో గణపతి సాధారణ వ్యక్తిగా నేపాల్‌లో సంచరిస్తున్నట్లు ఇంటలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. వెంటనే ఆయన ఎక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు ప్రత్యేక బృందం నేపాల్‌కు వెళ్లి, ఆయనను అదుపులోకి తీసుకున్న తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో గణపతి లొంగుబాటు ప్రకటనను కేంద్రం విడుదల చేసిన తరువాత, తెలంగాణ ప్రభుత్వం ముందు లొంగిపోవచ్చని తెలుస్తోంది.

**తరగతి గది నుంచి అడవిలోకి..**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ లో1949 జన్మించిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్‌గణపతి ఉన్నత విద్యావంతుడు, 1983లో వరంగల్‌లో బీఈడీ చేస్తున్న సమయంలో విప్లవ సిద్ధాంతల పట్ల ఆకర్షితుడయ్యారు. కొన్ని రోజులు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేశారు. అనంతరం పీపుల్స్ వార్ రూపకర్తగా అడవి బాట పట్టారు. అప్పటికే ఆయనకు భార్య సుజాత, పిల్లలు ఉన్నారు. జగిత్యాల జైత్రయాత్రతో పాల్గొన్న ఆయన పార్టీలో టీచర్ గా పిలుచుకునే వారు. 1991లో కొండపల్లి సీతారామయ్య పార్టీ నుంచి బహిష్కరణకు గురైన తరువాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన కాలంలో ఎన్నో చారిత్రాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. పీపుల్స్‌వార్ పార్టీ, మావోయిస్టు పార్టీగా అవతరించింది. 2004లో మవోయిస్టు పార్టీగా అవతరలించిన అనంతరం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొని 2018 లో అనారోగ్యం కారణంగా కార్యదర్శి పదవి నుంచి వైదొలగారు. అనంతరం ఫిలిఫ్ఫిన్స్ , బంగ్లాదేశ్ తో పాటు పలు దేశాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని చివరకు నేపాల్ లో సాధారణ జీవితం గడుపుతున్నట్లు తెలిసింది.

**ఆపరేషన్ కగార్ తో కకావికలం..**

గణపతి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వైదొలగిన తరువాత ఆయన స్థానంలో నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజు సారయ్య బాధ్యతలు తీసుకున్నారు. అదే సమయంలో ఆపరేషన్ కగార్ కు కేంద్రం శ్రీకారం చుట్టింది. దండకారణ్యంపై కేంద్ర బలగాలు దండెత్తాయి. చత్తీస్‌ఘఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలను పూర్తిగా జల్లెడ పడుతూ కూంబింగ్ ఉధృతం చేశాయి. ఎంతో మంది మావోయిస్టు నాయకులతో పాటు దళ సభ్యులు ఎన్‌కౌంటర్లలలో నేలకొరిగారు. 2025లో చత్తీస్‌ఘడ్ నారాయణపూర్‌జిల్లాలో మే 2025లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో బసవరాజు సారయ్య మృతి చెందాడు. మార్చి 31లోగా నక్సలిజం లేకుండా ఏరిపారేస్తామని కేంద్రమంత్రి హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడంతో పాటు దాడులను తీవ్రతరం చేశారు. దీంతో మావోయిస్టు పార్టీ నాయకుల్లో సైతం ఒక చర్చ మొదలయ్యింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అస్త్ర సన్యాసం చేయడం తప్ప వేరే మార్గం లేదని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు కొంతమంది నాయకులు వ్యతిరేకించారు. చివరకు మావోయిస్టు అగ్రనాయకులు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ సోను దాదా మహారాష్ట్ర ముఖ్యమంత్రి ముందు భారీ సంఖ్యలో మావోయిస్టు దళాలలతో లొంగిపోయారు. దీంతో మరింత ఒత్తిడి పెరిగింది. నంబాల మరణాంతరం ప్రధాన కార్యదర్శి బాధ్యతలు తీసుకున్న తిప్పిరి తిరుపతితో పాటు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి, బడే చొక్కా రావు లొంగిపోవడంతో మావోయిస్టు ఉద్యమం చరమాంకానికి చేరింది. చివరికి గణపతిపై దృష్టి మరలింది. గణపతి ఎక్కడ ఉన్నాడు.. ఏ పరిస్థితిలో ఉన్నాడు అనే విషయాలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీయడం ప్రారంభించారు. గణపతి లొంగిపోతే మావోయిస్టు చరిత్ర ముగిసినట్లేనని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. అయితే ఎప్పుడు, ఎక్కడ గణపతి లొంగిపోతాడనే విషయం ఒకటి, రెండు రోజుల్లో తేలిపోనుంది. వివిధ రాష్ట్రాలలో పలు కేసులున్న ఆయనపై రూ.కోటి నుంచి 2.5 కోట్ల వరకు రివార్డు ఉండవచ్చని భావిస్తున్నారు. ఆయన లొంగుబాటుతో కేంద్ర ప్రభుత్వం అనుకున్న మార్చి 31 లోపు మావోయిస్టు రహిత భారతదేశం అనే లక్ష్యం సాధించినట్లు అనుకుంటున్నారు.

# స్వ‘భద్రమేనా’

- **తెలంగాణ సీపీఎం గతమెంతో ఘనం**
- **ఇప్పుడు నిర్వీర్యం**
- **అంతా వీరభద్రం రాజకీయమేనా..?**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



సీపీఎం స్టేట్ సెక్రెటరీ.. తమ్మినేని వీరభద్రం... చాలా ఏండ్లు వినిపించిన మాట ఇదే. పార్టీ తరపున అసెంబ్లీ నుంచి గ్రామ స్థాయి వరకు ప్రాతినిధ్యం తగ్గుతూ.. తగ్గుతూ.. చివరకు లేకుండా పోయినా ఆయన్ను మాత్రం ఎర్రజెండా నీడలో భద్రంగానే ఉంటారు. తెలంగాణలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి, రాజకీయాలను శాసించిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా మార్క్సిస్ట్ సీపీఎం ప్రస్తుతం ఉనికి కోసం పోరాడుతోంది. పార్టీ అంతర్గత సంక్షోభం, ఎన్నికల్లో వరుస పరాజయాలు ఆ పార్టీ ఉందా లేదా అన్న అనుమానాలు రావడానికి కారణం అయ్యాయి. ఇటీవలి కాలంలో ఒక్కటంటే ఒక్క చెప్పుకోదగ్గ విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు తమ్మినేని వీరభద్రాన్ని ఆపార్టీ హైకమాండ్ అభిశంసించడం.. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా కనిపిస్తోంది.

**అస్తిత్వ పోరాటంలో సీపీఎం**

తెలంగాణ రాజకీయాల్లో సీపీఎం ప్రస్థానం ప్రస్తుతం అత్యంత క్లిష్ట దశకు చేరుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో కింగ్ మేకర్‌గా ఉన్న ఈ పార్టీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సున్నం రాజయ్య రూపంలో భద్రాచలం నుండి ఒకే ఒక సీటు సాధించిన సీపీఎం, ఆ తర్వాత 2018 మరియు 2023 ఎన్నికల్లో అసెంబ్లీలో ప్రాతినిధ్యాన్ని పూర్తిగా కోల్పోయింది. గత పదేళ్లుగా చట్టసభల్లో గొంతుక లేకపోవడం ఆ పార్టీ కేడర్‌ను తీవ్రంగా నిరాశకు గురిచేసింది. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్నామని చెబుతున్నా, అవి ఓట్లుగా మారకపోవడం ఆ పార్టీ వైఫల్యానికి అద్దం పడుతోంది.

**గ్రామస్థాయిలోనూ క్యాడర్ నిర్వీర్యం**

కమ్యూనిస్టులు ముఖ్యంగా సీపీఎంకు గట్టిక్యాడర్ ఉంటుంది. అయితే రాను రాను ఆ క్యాడర్ కూడా మారిపోతోంది. దానికి లోకల్ పోల్సే సాక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సీపీఎం పరిస్థితి దయనీయంగా మారింది. గత మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వందలాది వార్డుల్లో పోటీ చేసినా, కేవలం 1012 వార్డులను మాత్రమే గెలుచుకోగలిగింది. అటు పంచాయతీ ఎన్నికల్లో కూడా ఒకప్పుడు వందలాది సర్పంచ్ స్థానాలను గెలుచుకున్న పార్టీ, గత ఎన్నికల్లో కేవలం అతి తక్కువ గ్రామ పంచాయతీలకే పరిమితమైంది. నల్గొండ, ఖమ్మం వంటి తమ బలమైన జిల్లాల్లో కూడా ప్రాతినిధ్యం నామమాత్రంగా మారిపోవడం పార్టీ పతనానికి నిదర్శనం.

**పార్టీని నాశనం చేశారని తమ్మినేని వీరభద్రంపై అభిశంసన**

తమ్మినేని వీరభద్రం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలో పార్టీ రాజకీయంగా ఎదగకపోగా, ఉన్న ఉనికిని కూడా కోల్పోయిందని కేంద్ర కమిటీ భావిస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో, కొత్త రక్తాన్ని ఎక్కించడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీని తన వ్యక్తిగత ఆకాంక్షల కోసం వాడుకున్నారని విమర్శలు వచ్చాయి. సిద్ధాంతాల కంటే ముఠా రాజకీయాలకే ప్రాధాన్యత పెరగడం వల్ల సామాన్య ప్రజలు పార్టీకి దూరమయ్యారు. అందుకే ఆయనను సొంత పార్టీ అభిశంసించింది. ఒక ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో, మరో ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుల కోసం వెంపర్లాడటం వల్ల సీపీఎం సొంత ఓటు బ్యాంకును. నిలబెట్టుకోలేకపోయింది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల కేడర్ కూడా ఇతర పార్టీల వైపు మళ్ళింది. ముఖ్యంగా యువతను ఆకర్షించడంలో సీపీఎం విఫలమైంది. నేటితరం రాజకీయాల్లో మారుతున్న సోషల్ మీడియా సమీకరణాలను, ఆధునిక ప్రచార పద్ధతులను అందిపుచ్చుకోవడంలో పాత కాలపు పద్ధతులే ఆ పార్టీని దెబ్బతీశాయి.

**తెలంగాణలో కోలుకోవడం అసాధ్యమేనా?**

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి బలమైన శక్తుల మధ్య సీపీఎం వంటి పార్టీలు మనుగడ సాగించడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. పార్టీ అంతర్గతంగా చీలిపోయి ఉండటం, నాయకత్వంపై నమ్మకం సడలడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలింది. పార్టీ కార్యకర్తలు కూడా ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ రక్షణ లేకపోవడంతో ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ఈ దశలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టే శక్తివంతమైన నాయకత్వం ప్రస్తుతం ఆ పార్టీలో కనిపించడం లేదు. సీపీఎం తెలంగాణలో కోలుకోవడం ఇక దాదాపు అసాధ్యమనే అనిపిస్తోంది. కేవలం గతకాలపు వైభవాన్ని నెమరువేసుకోవడం తప్ప, భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికలు ఆ పార్టీ దగ్గర లేవు. తమ్మినేని వంటి సీనియర్ నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా పార్టీని ప్రక్షాళన చేయాలనుకున్నా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన ఏ రాజకీయ పార్టీ అయినా మళ్లీ పుంజుకోవడం చరిత్రలో చాలా అరుదు. ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఎం తెలంగాణలో ఒక నామమాత్రపు శక్తిగా మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

# ఆంధ్ర నేతల పెత్తనాన్ని మాత్రమే ద్వేషించాం

- **తెలంగాణలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం కోసం జనం ఎదురుచూస్తున్నారు**
- **త్వరలో కొత్త పార్టీ**
- **అలిపిరిలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తిరుపతి :**




ఆంధ్రా ప్రజలంటే ఏనాడూ తమకు ద్వేషం లేదని ఆంధ్రా రాజకీయ నాయకుల పెత్తనాన్ని మాత్రమే ద్వేషించామని జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. తెలంగాణ, ఏపీ విడిపోయిన నేపథ్యంలో ఎవరి బాటన వారు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అక్కడి రౌస్ కోర్టు క్లీన్ చీట్ ఇచ్చిన నేపథ్యంలో గురువారం తిరుపతి చేరుకున్న ఆమె అలిపిరి నుంచి నడక మార్గంలో తిరుమల కొండపైకి చేరుకున్నారు. అంతకు ముందు ఆమె మీడియాతో మాట్లాడారు. లిక్కర్ కేసులో చేయని తప్పుకు నాలుగేళ్లుగా మానసిక వేదన అనుభవించానన్నారు. దేవుడి దయ వల్ల కేసును కోర్టు పూర్తిగా కొట్టేసిందన్నారు. కేసు నుంచి విముక్తి లభిస్తే కాలి నడకన తిరుమలకు వస్తానని మొక్కుకున్నానని అందుకే కాలినడక తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నానని చెప్పారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ లు ప్రతిపక్షాలుగా వైఫల్యం చెందాయన్నారు. ప్రత్యామ్నాయం లేకనే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఎక్కువ సీట్లు వచ్చాయని చెప్పారు. త్వరలో రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు వెల్లడించారు. పార్టీ పెట్టిన తర్వాత కొత్త కార్యక్రమాలు చేపడతామనీ మళ్లీ స్వామి వారి ఆశీస్సుల కోసం తిరుమల వస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి ఆలస్యంగా బరిలోకి దిగినప్పటికీ 40 స్థానాల్లో గెలిచిందన్నారు. ఎన్నికలు ధ్యేయంగా కాకుండా తెలంగాణ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. తెలంగాణ ప్రాంత పరిరక్షణ, అస్తిత్వం, హక్కుల కోసం పోరాటానికే పార్టీ పెడుతున్నామన్నారు. ఆంధ్రా ప్రాంతంలో ఆదినారాయణ, ప్రతాప్, కిషోర్ యాదవ్ తదితరులు జాగృతి కి మద్దతు ఇస్తున్నారు. అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, మహిళలు, యూత్ ను బీఆర్ఎస్ పూర్తిగా విస్మరించిందని కవిత ఆరోపించారు. తాను సిరిసిల్ల నుంచి పోటీ చేస్తానని తన కుమారుడు అనలేదని కవిత వివరణ ఇచ్చారు.

# జీహెచ్ఎంసీ అప్పులు సర్కార్ టేకోవర్

- **జీహెచ్ఎంసీ అప్పులు సర్కార్ టేకోవర్**
- **రూ.4,780 కోట్లు తీర్చేందుకు సిద్ధం**
- **కొత్త కార్పొరేషన్లలో ఆర్థిక సమస్య లేకుండా చేయాలని నిర్ణయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేసన్ (జీహెచ్ఎంసీ) అప్పుల భారాన్ని మోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జీహెచ్ఎంసీకి ఉన్న ఉన్న రూ.4,780 కోట్ల అప్పులను టేకోవర్ చేసి వాటిని చెల్లించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా జీహెచ్ఎంసీ ప్రాంతాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఆయా కార్పొరేషన్లకు ఆర్థిక సమస్య లేకుండా చేయాలని నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా మూడు కార్పొరేషన్లుగా విడిపోయిన జీహెచ్ఎంసీలో అప్పుల విభజన కోసం టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లకు అప్పులు పంచితే ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అందువల్ల ప్రభుత్వమే పూర్తి అప్పుల బాధ్యతలను తీసుకోనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. పెరిగిపోయిన అవసరాల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో మౌలిక వసతుల కల్పన ఇన్నాళ్లు జీహెచ్ఎంసీకి పెను భారంగా మారింది. ముఖ్యంగా 2014 నుంచి హైదరాబాద్ నగరంలో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు, కొత్త డ్రైనేజీ నాళాలు వంటి వసతుల నిర్మాణానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సుమారు రూ. 7 వేల కోట్ల వరకు అప్పులు చేసింది. ఈ రుణాలపై గత రెండేళ్లుగా ప్రతి నెల సుమారు రూ. వంద కోట్ల వరకు జీహెచ్ఎంసీ వడ్డీల భారం భరిస్తోంది. వీటికి తోడు ప్రభుత్వం నుంచి రావాల్సిన పలు నిధులు పెండింగ్ లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే బల్దియా అప్పులను టేకోవర్ చేయడం ద్వారా ట్రైకార్పోరేషన్లకు ఆర్థిక భారం లేకుండా చేయవచ్చని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలుస్తోంది.

# ఎండలు.. వర్షాలు.. జర జాగ్రత్త!

- **ఈ నెల 19 తర్వాత రాష్ట్రంలో భారీ వర్షా లు**
- **అప్పటి వరకు తప్పని భానుడి భగభగలు**
- **రాష్ట్ర వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు**


**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం అనూహ్యంగా మారనుంది. ఈ నెల మధ్య వరకు భానుడి భగభగలు కొనసాగనుండగా.. ఆ తర్వాత అకాల వర్షాలు పలకరించనున్నాయని వాతావరణ శాఖ, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు ముదిరిపోతున్నాయి. ఈ నెల 18వరకు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు చేరవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 37 డిగ్రీల మధ్య నమోదు కానున్నాయి. మధ్యాహ్నం 12 నుండి 4 గంటల మధ్య ప్రజలు అనవసరంగా బయటకు రాకూడదని.. ముఖ్యంగా వృద్ధులు , చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తూ ఈనెల 19వ తేదీ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణం శాఖ తెలిపింది. ఈసారి కురిసే వర్షాలు గత ఫిబ్రవరిలో వచ్చిన వానల కంటే తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ పంట కోత దశలో ఉన్న రైతులు ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కాగా ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉష్ణోగ్రతల పెరుగుదల దృష్ట్యా రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేశారు. ఎండలతో డీహైడ్రేషన్ బారిన పడకుండా నిమ్మరసం, కొబ్బరి నీళ్లు వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# పెయిడ్ సబ్‌స్క్రిప్షన్‌తో వాట్సప్ ప్లస్!

**ముద్ర డెస్క్ :**

మెటాకు చెందిన ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ త్వరలో కొత్త ప్రీమియం సేవలను అందించేందుకు సిద్ధమవుతోంది. ‘వాట్సప్+’ పేరుతో తీసుకురాబోతున్న ఈ సేవల్లో అదనపు ఫీచర్లను పొందాలంటే వినియోగదారులు సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా మెసేజింగ్ కోసం ఉపయోగించే వాట్సప్ సేవలు మాత్రం ఎప్పటిలానే ఉచితంగానే కొనసాగనున్నాయి. వాట్సప్ అప్‌డేట్లపై సమాచారం ఇచ్చే వాబీటా ఇన్ఫో వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రీమియం వినియోగదారులకు యాప్‌లో పలు కస్టమైజేషన్ ఆప్షన్లు లభించనున్నాయి. యాప్ థీమ్‌ను మార్చుకోవడం, నచ్చినట్లుగా ఐకాన్ స్టైల్‌ను ఎంచుకోవడం వంటి ఫీచర్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం 14 రకాల ఐకాన్ డిజైన్లను వాట్సప్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వాట్సప్‌లో మూడు చాట్‌లను మాత్రమే పిన్ చేసుకునే అవకాశం ఉండగా, వాట్సప్+లో 20 వరకు చాట్‌లను పిన్ చేసుకునే వీలుంటుంది. అలాగే వాట్సప్‌కు ప్రత్యేకంగా నోటిఫికేషన్ లేదా రింగ్‌టోన్‌ను సెట్ చేసుకునే సదుపాయం కూడా కల్పించనున్నారు. ప్రీమియం సబ్‌స్క్రైబర్ల కోసం ప్రత్యేక స్టిక్కర్ ప్యాక్‌లు, కొత్త రియాక్షన్ ఎమోజీలు కూడా అందుబాటులోకి రావచ్చు. ప్రస్తుతం ఆండ్రాయిడ్, ఐఓఎస్ వర్షన్లలో ఈ ఫీచర్ల అభివృద్ధి జరుగుతోంది. అయితే ఈ ప్రీమియం సేవలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయి, సబ్‌స్క్రిప్షన్ ధర ఎంత ఉండనుంది అనే వివరాలు ఇంకా వెల్లడించలేదు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
06.03.2026 శుక్రవారం, హైదరాబాద్



వాట్సాప్ ముఖ్యమైన ఫీచర్లు

ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్
వాట్సాప్‌లో చాట్లు పూర్తిగా సురక్షితంగా ఉంటాయి. పంపిన సందేశాన్ని పంపినవారు మరియు స్వీకరించినవారు మాత్రమే చూడగలరు.



# జింబాబ్వే జట్టుకు ఊరట..

- **స్వదేశ ప్రయాణానికి మార్గం సుగమం**

టీ20 ప్రపంచకప్2026లో పాల్గొన్న జింబాబ్వే క్రికెట్ జట్టుకు చివరికి ఊరట లభించింది. కొన్ని రోజులుగా భారత్‌లోనే చిక్కుకుపోయిన ఆ జట్టు స్వదేశానికి వెళ్లే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ టోర్నీలో జింబాబ్వే ఆశ్చర్యకర ప్రదర్శన చేసింది. గ్రూప్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లను ఓడించి గ్రూప్‌బి టాపర్‌గా సూపర్ 8కు చేరింది. అయితే తదుపరి దశలో వెస్టిండీస్, భారత్, దక్షిణాఫ్రికా చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. టోర్నీ ముగిసిన తర్వాత మార్చి 2న జింబాబ్వే జట్టు భారత్ నుంచి స్వదేశానికి వెళ్లాల్సి ఉంది. కానీ ఇరాన్‌ఇజ్రాయెల్, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో గల్ఫ్ ప్రాంతంలో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దీంతో జట్టు ప్రయాణం ఆలస్యమైంది. ఈ పరిస్థితుల్లో జింబాబ్వే క్రికెట్ బోర్డు కొత్త ఏర్పాట్లు చేసింది. ఆటగాళ్లను విడతల వారీగా స్వదేశానికి పంపాలని నిర్ణయించింది. బుధవారం తొలి బృందం బయల్దేరగా, చివరి బృందం శుక్రవారం భారత్ నుంచి ప్రయాణం ప్రారంభించనుంది. సాధారణంగా దుబాయ్ మార్గంగా వెళ్లాల్సిన జట్టు, ఇప్పుడు అదిస్ అబాబా (ఇథియోపియా) మీదుగా హరారేకు చేరుకోనుంది. తగినన్ని విమానాలు అందుబాటులో లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. ఇదే సమయంలో వెస్టిండీస్ జట్టు కూడా కొద్ది రోజుల పాటు భారత్‌లోనే ఉండిపోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే.



# మళ్లీ విఫలమైన అభిషేక్ శర్మ..

- **అభిమానుల ఆగ్రహం**



టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి నిరాశపరిచాడు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన కీలక సెమీఫైనల్ మ్యాచ్‌లో అతడు పేలవ ప్రదర్శనతో స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు. దీంతో అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ టోర్నీ ప్రారంభం నుంచే అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో డకౌట్లతో నిరాశపరిచాడు. సూపర్ 8లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో 15 పరుగులు మాత్రమే చేశాడు. జింబాబ్వేతో మ్యాచ్‌లో మాత్రం అర్ధశతకం చేసి కొంత మెరుగైన ప్రదర్శన చేశాడు. అయితే వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో కూడా కేవలం పది పరుగులకే అవుటయ్యాడు. దీంతో సెమీఫైనల్‌కు ముందు అతడిని జట్టులో కొనసాగించాలా అనే చర్చలు కూడా జరిగాయి. అయినప్పటికీ జట్టు యాజమాన్యం అతడిపై నమ్మకం ఉంచింది. ముంబైలో గురువారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్ ముందుగా బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్‌గా వచ్చిన అభిషేక్ శర్మ ఏడు బంతుల్లో రెండు ఫోర్లు కొట్టి కేవలం తొమ్మిది పరుగులకే అవుటయ్యాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బంతిని గాల్లోకి లేపగా ఫీల్డర్ క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు అభిషేక్ శర్మ మొత్తం 89 పరుగులు మాత్రమే చేశాడు. వరుస వైఫల్యాలతో అభిమానులు అతడిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. "ఇంకా అవకాశం ఎందుకు ఇస్తున్నారు.. జట్టులో నుంచి తీసేయండి" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

# రషీద్ ఖాన్‌కు షాక్..

**అఫ్గాన్ టీ20 కెప్టెన్సీ నుంచి తొలగింపు**



అఫ్గనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌కు అఫ్గాన్ క్రికెట్ బోర్డు షాక్ ఇచ్చింది. టీ20 జట్టు కెప్టెన్ పదవి నుంచి అతడిని తప్పిస్తూ ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించింది. ఈ విషయాన్ని అఫ్గాన్ క్రికెట్ బోర్డు గురువారం అధికారికంగా ప్రకటించింది. శ్రీలంకతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్ నుంచి ఇబ్రహీం జద్రాన్ టీ20 జట్టు సారథిగా బాధ్యతలు చేపట్టనున్నాడు. రషీద్ ఖాన్ కెప్టెన్సీలో జట్టు ఎన్నో గుర్తుండిపోయే విజయాలు సాధించిందని బోర్డు తెలిపింది. ముఖ్యంగా 2024 టీ20 ప్రపంచకప్‌లో అఫ్గనిస్తాన్ జట్టు సెమీఫైనల్ చేరడం పెద్ద విజయంగా పేర్కొంది. అయితే జట్టు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నాయకత్వంలో మార్పులు చేస్తున్నామని అఫ్గాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. రషీద్ ఖాన్‌కు డిప్యూటీగా ఉన్న ఇబ్రహీం జద్రాన్‌కు కెప్టెన్సీ అప్పగించామని చీఫ్ సెలక్టర్ అహ్మద్ షా సలీమనిఖిల్ తెలిపారు.
ఇక టీ20 ప్రపంచకప్ 2026లో అఫ్గనిస్తాన్ జట్టు నిరాశపరిచింది. గ్రూప్ దశలో నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలే సాధించి సూపర్ 8 దశకు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది.



# బ్రూక్ ఎంతపని చేశావ్.. దుమ్మురేపిన సంజూ సామ్సన్

టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ చేసిన ఒక పొరపాటు మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేసింది. ప్రమాదకర ఫామ్‌లో ఉన్న సంజూ సామ్సన్ ఇచ్చిన సులభ క్యాచ్‌ను బ్రూక్ వదిలేయడంతో టీమిండియాకు పెద్ద అవకాశం దొరికింది. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ వేసిన బంతిని సామ్సన్ మిడ్‌ఆన్ మీదుగా ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే బంతి బ్యాట్ కింది భాగాన్ని తాకి గాల్లోకి ఎగిరింది. అక్కడే ఉన్న బ్రూక్ ఆ క్యాచ్‌ను పట్టుకోలేకపోయాడు. ఈ తప్పిదంతో ఆర్చర్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సామ్సన్ ఆ తర్వాత మరింత దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లేలోనే ఇంగ్లాండ్ బౌలర్లపై వరుసగా షాట్లు ఆడుతూ స్కోరు వేగాన్ని పెంచాడు. గత మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 97 పరుగులతో అజేయంగా నిలిచిన అతడు అదే ఫామ్‌ను ఇక్కడ కూడా కొనసాగించాడు. బ్రూక్ వదిలేసిన క్యాచ్ తర్వాత సామ్సన్ కేవలం 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. వరుసగా రెండో హాఫ్ సెంచరీతో టోర్నీలో తన ఫామ్‌ను మరోసారి చూపించాడు. 200కుపైగా స్ట్రైక్ రేట్‌తో ఆడుతూ ఇంగ్లాండ్ బౌలర్లకు పెద్ద సవాల్‌గా మారాడు. ఈ ఒక్క క్యాచ్ మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది

# టీమిండియా బ్యాటర్ల ఊచకోత..

**ఇంగ్లండ్ ముందు 253 పరుగుల భారీ లక్ష్యం**

టీ20 ప్రపంచకప్2026 సెమీఫైనల్లో టీమిండియా బ్యాటర్లు తుఫాను ఇన్నింగ్స్‌లతో ఇంగ్లండ్ బౌలింగ్‌ను పూర్తిగా మట్టికరిపించారు. ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ కీలక మ్యాచ్‌లో సంజూ శాంసన్, శివం దూబే దూకుడు బ్యాటింగ్‌తో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ స్కోరు టోర్నమెంట్‌లోనే రెండో అత్యధిక స్కోరు మాత్రమే కాకుండా టీ20 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల చరిత్రలో అత్యధిక స్కోరుగా నిలిచింది. ఇంతకు ముందు నాకౌట్ మ్యాచ్‌లో వెస్టిండీస్ చేసిన 205 పరుగులే అత్యధికంగా ఉండగా, ఇప్పుడు భారత్ ఆ రికార్డును దాటేసింది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్ అభిషేక్ శర్మ త్వరగా అవుటైనప్పటికీ సంజూ శాంసన్ అద్భుతంగా ఆడాడు. మూడో ఓవర్లో వచ్చిన క్యాచ్ అవకాశాన్ని ఇంగ్లండ్ చేజార్చుకోవడంతో సంజూ దూకుడు పెంచాడు. అద్భుతమైన షాట్లు ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లపై పూర్తిగా ఆధిపత్యం చూపించాడు. మొత్తం 42 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 89 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. సంజూ ఔట్ అయిన తర్వాత శివం దూబే కూడా తన శక్తివంతమైన బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ బౌలర్లను ఇబ్బంది పెట్టాడు. స్పిన్నర్లు, పేసర్లపై సమానంగా దాడి చేస్తూ వేగంగా పరుగులు సాధించాడు. దూబే 25 బంతుల్లో 43 పరుగులు చేసి జట్టు స్కోరు 250 దాటేలా కీలక పాత్ర పోషించాడు. భారత్ చేసిన 253 పరుగులు టీ20 ప్రపంచకప్ నాకౌట్ దశల్లో అత్యధిక స్కోరుగా నిలిచాయి. ఇదే టోర్నీలో జింబాబ్వేపై భారత్ చేసిన 256 పరుగుల తర్వాత టీమిండియాకు ఇది రెండో అత్యధిక స్కోరు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంక 2007లో కెన్యాపై చేసిన 260 పరుగుల రికార్డుకు భారత్ కేవలం ఏడు పరుగుల దూరంలో నిలిచింది. ఇప్పుడు ఫైనల్‌కు చేరాలంటే ఇంగ్లండ్ 253 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. టీ20 క్రికెట్‌లో ఇది అత్యంత కఠినమైన లక్ష్యాల్లో ఒకటిగా భావిస్తున్నారు. దీంతో ఫైనల్ చేరాలంటే ఇంగ్లండ్‌కు అద్భుతమే జరగాల్సి ఉంది.






# హైదరాబాద్‌లో మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్

- **నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి**
- **మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు వేదికగా మారబోతోంది. తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ మహిళల వరల్డ్ కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గచ్చిబౌలిలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మార్చి 8 నుంచి 14 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరగనున్నాయని చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, వేల్స్ జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాలిఫయర్స్‌కు ఈ పోటీలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలు కల్పించిందని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల ఆస్ట్రోటర్ఫ్ మైదానం, భద్రతా ఏర్పాట్లు, క్రీడాకారిణులకు వసతి సౌకర్యాలు సిద్ధం చేశామని చెప్పారు. ఇప్పటికే పాల్గొనే జట్లు హైదరాబాద్‌కు చేరుకుని గచ్చిబౌలి స్టేడియంలో సాధన ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయ క్రీడాకారులు, ప్రతినిధుల కోసం నగరంలోని వారసత్వ ప్రదేశాల పర్యటనలు, వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో రాష్ట్రంలో క్రీడా రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఈ హాకీ టోర్నమెంట్‌ను ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించాలని, మీడియా విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి పాల్గొన్నారు

# వైభవంగా అర్జున్ టెండూల్కర్ వివాహం..

- **తరలివచ్చిన క్రీడా, సినీ ప్రముఖులు..!**
- **సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహం**

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహ బంధంలో అడుగుపెట్టాడు. ఆంత్రోప్రెన్యూర్ సానియా చందోక్‌ను ఆయన పెళ్లి చేసుకున్నారు. ముంబైలో జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.
గత ఏడాది ఆగస్టు 25న అర్జున్, సానియా నిశ్చితార్థం జరిగింది. ఇటీవల జరిగిన పెళ్లి వేడుకలు సన్నిహితుల సమక్షంలో దక్షిణ ముంబైలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీడా, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేశారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన భార్య సాక్షితో కలిసి హాజరయ్యారు. సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, రవి శాస్త్రి వంటి మాజీ క్రికెటర్లు కూడా కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గౌతమ్ గంభీర్, యూసుఫ్ పఠాన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఐసీసీ చైర్మన్ జై షా తదితరులు కూడా కార్యక్రమానికి వచ్చారు. ప్రస్తుతం అర్జున్ టెండూల్కర్ దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందిన అతను భవిష్యత్తులో భారత జట్టులో స్థానం సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నాడు. వధువు సానియా చందోక్ ముంబైకి చెందిన వ్యాపారవేత్త. పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన సేవలను అందించే "మిస్టర్ పాస్" అనే పెట్ స్పాను నిర్వహిస్తున్నారు



# హోటల్ లో మహిళా సిబ్బందితో క్రికెటర్ పాడుపని

టీ20 ప్రపంచకప్ సందర్భంగా పాకిస్తాన్ జట్టుకు చెందిన ఒక క్రికెటర్ హోటల్ మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. శ్రీలంకతో సూపర్ 8 మ్యాచ్‌కు ముందు కాండీలో ఉన్న ఒక హోటల్‌లో ఈ సంఘటన జరిగినట్లు విదేశీ మీడియా కథనాలు పేర్కొన్నాయి. హోటల్ హౌజ్‌కీపింగ్ విభాగంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందితో ఆ క్రికెటర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి హోటల్ సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై హోటల్ నిర్వహణ పాకిస్తాన్ జట్టు మేనేజర్ నవీద్ చీమాకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సంఘటనను తీవ్రంగా పరిగణించిన హోటల్ యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. అనంతరం ఆ



క్రికెటర్ తరఫున జట్టు మేనేజ్‌మెంట్ క్షమాపణలు తెలిపినట్లు తెలుస్తోంది. దీనితో అతనికి జరిమానా విధించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కూడా దృష్టి సారించింది. సంఘటనపై పూర్తి వివరాలు సేకరించి క్రమశిక్షణా కమిటీ తగిన చర్యలు తీసుకునే అవకాశముందని వార్తలు వస్తున్నాయి.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
06.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## మెగాస్టార్ మూవీలో రాశీ ఖన్నా?

మెగాస్టార్ చిరంజీవి వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం దర్శకుడు బాబీ (కె.ఎస్. రవీంద్ర)తో మరో సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపికపై ప్రస్తుతం ఫిల్మ్ నగర్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో రెండో కథానాయికగా రాశీ ఖన్నా కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. గ్లామర్‌తో పాటు నటనతో గుర్తింపు పొందిన రాశీ ఖన్నా ఈ ప్రాజెక్ట్‌లో భాగమైతే సినిమాకు మరింత ఆకర్షణ పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో కూడా నటిస్తున్నట్లు సమాచారం. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోంది.



## 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్ డేట్ మారిందా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీ ముందుకు జరగొచ్చన్న వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు ఉన్న షెడ్యూల్ కంటే ముందుగా, మార్చి 19న సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారనే ప్రచారం నిన్న సాయంత్రం ఒక్కసారిగా హల్‌చల్ సృష్టించింది. ఉదయం మరో పెద్ద సినిమా వాయిదా పడిందన్న వార్తల తర్వాత, ఈ కొత్త సమాచారం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచింది.మార్చి మూడో వారం ఉగాది, రంజాన్ పండగలు ఒకే సమయంలో రావడం నిర్మాతలకు పెద్ద అవకాశంగా కనిపిస్తోంది. ఆ సమయంలో వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ఉండటంతో కుటుంబాలతో కలిసి ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అటువంటి సమయంలో పెద్ద స్టార్ సినిమా విడుదలైతే బాక్సాఫీస్ వద్ద భారీ స్పందన వచ్చే అవకాశాలు ఉంటాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అదే సమయంలో మార్చి చివరి వారంలో కూడా శ్రీరామనవమి, గుడ్ ఫ్రైడే వంటి పండగలు ఉండటంతో పాటు వీకెండ్ కలవడం సినిమాకు అదనపు ప్రయోజనంగా మారొచ్చు. టికెట్ ధరల పెంపుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లయితే తొలి పది రోజులలోనే భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. మంచి టాక్ వస్తే కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ అవకాశాన్ని వదులుకోకూడదనే ఉద్దేశంతో నిర్మాత సంస్థ మైత్రి మూవీ మేకర్స్ విడుదలను ముందుకు తీసుకురావాలని వేగంగా పనులు పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే డిస్ట్రిబ్యూటర్లకు సమాచారం ఇచ్చినట్లు కూడా ప్రచారం సాగుతోంది.అయితే విడుదలను ముందుకు తీసుకురావాలంటే డబ్బింగ్, రీ రికార్డింగ్, సెన్సార్ వంటి పనులను తక్కువ సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అందుకే చిత్రబృందం వేగంగా పనులు పూర్తి చేసే ప్రయత్నంలో ఉందని సమాచారం. త్వరలోనే ఈ విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.



## దుబాయ్‌లో చిక్కుకున్న ప్రయాణికులకు సోనూసూద్ సాయం

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో విమాన సర్వీసులు రద్దవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో దుబాయ్ విమానాశ్రయంలో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఈ క్లిష్ట సమయంలో బాలీవుడ్ నటుడు సోనూసూద్ ముందుకు వచ్చి వారికి సహాయం చేయడానికి సిద్ధమయ్యారు. దుబాయ్‌లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఎటువంటి షరతులు లేకుండా ఉచితంగా వసతి కల్పిస్తామని సోనూసూద్ ప్రకటించారు. ఈ కష్టకాలంలో మానవత్వమే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా సహాయం అవసరమైతే తనను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంప్రదించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే తన వాలంటీర్ల బృందం అవసరమైన సహాయం అందిస్తుందని చెప్పారు. సోనూసూద్ ఇప్పటికే కరోనా కాలంలో వలస కార్మికులకు, ఇబ్బందుల్లో ఉన్న అనేక మందికి సహాయం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు కూడా విదేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులకు అండగా నిలవడం ద్వారా మరోసారి తన సేవా మనసును చాటుకున్నారు



## 'పెద్ది'కి ఐపీఎల్ కలిసొచ్చేనా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాపై క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. మొదట్లో ఈ ప్రాజెక్ట్‌పై పెద్దగా అంచనాలు లేకపోయినా, విడుదలైన గ్లింప్స్ తర్వాత పరిస్థితి మారిపోయింది. ముఖ్యంగా రామ్ చరణ్ బ్యాట్ పట్టుకుని కొట్టిన క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఆ సీన్ రీల్స్, షార్ట్ వీడియోల్లో విపరీతంగా ట్రెండ్ అయ్యింది. ఐపీఎల్ ప్రారంభానికి ముందే ఆ గ్లింప్స్ విడుదల కావడంతో క్రికెట్ అభిమానుల్లో కూడా సినిమా గురించి చర్చ మొదలైంది. చాలామంది ఆ షాట్‌ను అనుకరిస్తూ వీడియోలు చేయడంతో సినిమాకు అదనపు ప్రచారం లభించింది. తర్వాత వచ్చిన 'చికిరి' పాట కూడా మంచి స్పందన తెచ్చుకుంది. తాజాగా విడుదలైన 'రారా రై రా' పాటలో రామ్ చరణ్ వేసిన స్టెప్పులు, అలాగే మరో కొత్త క్రికెట్ షాట్ కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది. ఐపీఎల్ సీజన్ దగ్గరపడుతున్న సమయంలో ఈ పాట విడుదల కావడంతో నెటిజన్లు క్రికెట్ విజువల్స్‌తో ఈ పాటను కలిపి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సుకుమార్ సమర్పిస్తున్నారు. ఏప్రిల్ 30న విడుదల కానున్న 'పెద్ది'కి ఐపీఎల్ హడావుడి ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి.



## దుష్టశక్తిని అంతమొందించే 'వృషకర్మ'

గత ఏడాది 'తండేల్' సినిమాతో విజయాన్ని అందుకున్న నాగచైతన్య ఇప్పుడు 'వృషకర్మ' అనే కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'విరూపాక్ష'తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కార్తీక్ దండు ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై నాగచైతన్య చాలా కాలంగా పనిచేస్తూ, కథపై నమ్మకంతో ఎంతో శ్రద్ధగా సిద్ధమయ్యారు. ఇటీవల విడుదలైన టీజర్‌లో 'వృషకర్మ' ప్రపంచాన్ని చిన్నగా పరిచయం చేశారు. కథలో సృష్టిని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఒక భయంకరమైన దుష్టశక్తి అవతరిస్తుంది. అతని శక్తి ఎంతో ప్రమాదకరంగా ఉండి, అతని నుంచి వచ్చే గబ్బిలాన్ని తాకినా మనిషి ప్రాణాలు పోతాయని చూపించారు. అలాంటి దుష్టశక్తిని ఎదుర్కొని అంతమొందించే శక్తి 'వృషకర్మ' అనే పాత్రకే ఉందని టీజర్ సంకేతాలు ఇస్తోంది. కథలోని ముఖ్యమైన అంశాలను పూర్తిగా బయటపెట్టకుండా దర్శకుడు జాగ్రత్తగా టీజర్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. విజువల్స్‌లో ఫాంటసీ ఎలిమెంట్స్ స్పష్టంగా కనిపిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రంలో నాగచైతన్య భిన్నమైన లుక్‌లో కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ఫిట్‌నెస్, లుక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు టీజర్‌లోనే తెలుస్తోంది. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని అజనీష్ లోకనాథ్ అందిస్తున్నారు. ఫాంటసీ డ్రామాగా రూపొందుతున్న 'వృషకర్మ' చిత్రానికి విడుదల తేదీని త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

**నాగచైతన్యకు తప్పిన పెద్ద ప్రమాదం**

హీరో నాగచైతన్య తన కొత్త చిత్రం 'వృషకర్మ' ప్రమోషన్ కార్యక్రమంలో చిన్న అపశృతి ఎదురైంది. సినిమా గ్లింప్స్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమ్యాక్స్ పీసీఎక్స్ స్క్రీన్‌లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్రబృందం ప్రసంగాలు ముగిసిన తర్వాత మీడియాతో చిట్‌చాట్ నిర్వహించేందుకు వేదికపై కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో నాగచైతన్య ఒక కుర్చీలో కూర్చోగానే అది ఒక్కసారిగా వంగిపోయింది. దీంతో ఆయన వెనక్కి జారి కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ ఉన్న చిత్ర బృందం సభ్యులు, అభిమానులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. చైతన్యకు ఎక్కడైనా గాయం అయ్యిందేమోనని క్షణం పాటు అందరూ కంగారుపడ్డారు. అయితే నాగచైతన్య వెంటనే తేరుకుని పక్కనే ఉన్న దర్శకుడు కార్తీక్ దండు సహాయంతో లేచి నిలబడ్డారు. అనంతరం మరో కుర్చీలో కూర్చుని కార్యక్రమాన్ని కొనసాగించారు. ఏర్పాట్లలో జరిగిన ఈ చిన్న లోపంపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేసినప్పటికీ, తర్వాత మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ 'వృషకర్మ' సినిమా గురించి వివరించారు.



## మోనోకినిలో ఖుషీ కపూర్ గ్లామర్

యువ నటి ఖుషీ కపూర్ తాజాగా చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో ఆకర్షణగా మారింది. ఈ ఫోటోల్లో ఆమె మోనోకిని స్టైల్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించింది. పైభాగంలో కార్సెట్ తరహా ఫిట్‌తో సున్నితమైన లేస్ డిజైన్ ఉండగా, కింద భాగంలో పూల ఆకృతులతో ఉన్న డిజైన్ డ్రెస్‌కు ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చింది. ఈ అవుట్‌ఫిట్ ఆమె లుక్‌ను గ్లామర్‌గా చూపిస్తూ కూడా క్లాసీ టచ్‌ను ఇచ్చింది. ఫోటోషూట్‌లో ఖుషీ కాస్త వాలి కూర్చుని కెమెరాకు సాఫ్ట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ ఆకట్టుకునే పోజులు ఇచ్చింది. ఆమె స్టైల్ చాలా సహజంగా కనిపించింది. బ్యాక్‌గ్రౌండ్ కూడా ఫోటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పింక్ రంగు గోడపై ఉన్న పాతకాలపు డిజైన్ ప్యానెల్స్, వెనుక కనిపించే పెయింటింగ్ కలిసి ఫోటోలకు పాతకాలపు అందాన్ని తీసుకొచ్చాయి. అలాగే వింటేజ్ వేవ్స్ తరహా హెయిర్ స్టైల్ ఆమె ముఖాన్ని మరింత అందంగా హైలైట్ చేసింది. మొత్తానికి ఈ ఫోటోషూట్‌తో ఖుషీ కపూర్ గ్లామర్‌తో పాటు తన స్టైల్‌ను మరోసారి చూపించింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com